

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | బుధవారం 19-5-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 241 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# కొవిడ్‌పై యుద్ధం ప్రతి ప్రాణాన్ని కాపాడేలా ఉండాలి: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, మే 18: కొవిడ్-19పై మన పోరాటం ప్రతి ఒక్క ప్రాణాన్ని కాపాడేలా ఉండాలని, గత ఏడాది కాలంగా జరిగిన ప్రతి సమావేశంలో తాను ఈ విషయాన్ని చెబుతూ వస్తున్నానని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. దేశంలో కరోనా పరిస్థితిపై రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కరోనాపై పోరులో మీరంతా కీలకపాత్ర పోషిస్తున్నారని, ఈ పోరాటంలో మీరు ఫీల్డ్ కమాండర్స్ అని అధికారులను ప్రధాని ప్రశంసించారు.

గత ఏడాది మనం వ్యవసాయ రంగంపై నిషేధం విధించలేదని, అయినా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు పంట పొలాల్లో సామాజిక దూరం పాటించిన తీరు తనను విస్మయానికి గురిచేసిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అది గ్రామీణ ప్రాంతాల ప్రజల గొప్పతనమని కొనియాడారు. కరోనా మహమ్మారిపై పోరాటంలో లోకల్ కంటైన్‌మెంట్ జోన్‌లు, వేగంగా పరీక్షల నిర్వహణ, ప్రజలకు సరైన, సంపూర్ణ సమాచారం ఇవ్వడం అనేవి మన ప్రధాన ఆయుధాలని ప్రధాని చెప్పారు.

రాష్ట్రాలకు 15 రోజుల ముందే వ్యాక్సినేషన్ షెడ్యూల్

ప్రతిరోజూ సాధ్యమైనంత ఎక్కువ మందికి టీకాలు వేయడం కోసం నిరంతరాయంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందుకోసం కేంద్ర వైద్యారోగ్య శాఖ ఎంతో కృషి చేస్తున్నదని ప్రధాని మోదీ తెలిపారు. రాబోయే 15 రోజుల్లో వ్యాక్సినేషన్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్రాలకు ముందస్తుగానే తెలియజేయనున్నట్లు ప్రధాని వెల్లడించారు. దీనివల్ల జిల్లాస్థాయిలో ఎన్ని డోసుల వ్యాక్సిన్ అందుబాటులో ఉందో తెలుస్తుందని, దాంతో అందుకు తగినట్లుగా వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టడం సులభతరం అవుతుందని ప్రధాని పేర్కొన్నారు.

కేసులు తగ్గుతున్నప్పుడే అప్రమత్తత అవసరం

ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో కరోనా ప్రభావం తగ్గుతూ వస్తున్నదని, కానీ మరికొన్ని రాష్ట్రాల్లో మాత్రం పెరుగుతూ పోతున్నదని ప్రధాని చెప్పారు. కేసుల సంఖ్య తగ్గుతున్నప్పుడే మనం చాలా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కేసులు తగ్గుతున్నాయి కదా అని ఏమాత్రం అశ్రద్ధ చేసినా మహమ్మారి మళ్లీ విరుచుకుపడే ప్రమాదం ఉందన్నారు.

# దేశంలో కొత్తగా కరోనాతో 4329 మంది మృతి?.తగ్గేదేలా

హైదరాబాద్ , మే 18: భారత్ లో కరోనా కేసులు తగ్గుముఖం పడుతున్నాయి. తాజాగా గడిచిన 24 గంటల్లో మొత్తం 2,63,533కేసులు నమోదయ్యాయి. మరోవైపు 4,22,436మంది కరోనాను నుంచి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. అలాగే గడిచిన 24 గంటల్లో 4,329 మంది కరోనా తో మృతి చెందారు. తాజా గణాంకాల ప్రకారం దేశంలో మొత్తం 2,52,28,996 కరోనా కేసులు నమోదు అయ్యాయి.

అలాగే 2,15,96,512 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఇక 2,78,719 మంది మృతిచెందారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 33,53,765 యాక్టీవ్ కేసులు ఉన్నాయి. తాజాగా నమోదు అయిన కేసుల్లో అత్యధికంగా కర్ణాటకలో 38,603, తమిళనాడులో 33,075, మహారాష్ట్రలో 26,616 కేసులొచ్చాయి.

# తీరం దాటిన తుఫాన్.. పలు రాష్ట్రాల్లో తీరని నష్టం



హైదరాబాద్ , మే 18: పశ్చిమ తీర ప్రాంతంలో తౌకతే తుఫాన్ బీభత్సం సృష్టించింది. మహారాష్ట్ర, గుజరాత్, గోవా తీర ప్రాంతాలు తుఫాన్ దెబ్బకు విలవిలలాడాయి. గంటకు 185 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచాయి. 3 మీటర్లకు పైనే భీకర అలలు ఎగసిపడ్డాయి. అతి భారీ వర్షాలతో తుఫాన్ గుజరాత్‌లోని పోర్ బందర్, మహువా మధ్య తీరం దాటింది. తుఫాన్ తీరం దాటడానికి 3 గంటల సమయం పట్టింది.

దీని తీవ్రతకు గుజరాత్‌లో పెద్దఎత్తున చెట్లు నేలకొరిగాయి. భారీ వర్షాలు, పెనుగాలులు గుజరాత్‌ను ఇంకా వణికిస్తున్నాయి. జునాగఢ్, అమ్రేలి, గిర్ సోమ్ నాథ్ జిల్లాల్లో ఇవాళ కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముంబై విమానాశ్రయంలో రాకపోకల్ని నిలిపివేశారు. మొత్తం 55 సర్వీసులు రద్దయ్యాయి. ముంబై తీరంలో రెండు నౌకలు కొట్టుకుపోయాయి. ఒక దానిలో 273 మంది, రెండో నౌకలో 137 మంది ఉన్నారు. లంగరు వేసి ఉంచినా పెనుగాలుల ధాటికి నౌకలు కొట్టుకుపోయాయి. సహాయక బృందాలు రంగంలోకి దిగడంతో ప్రాణాపాయం తప్పింది.

కాగా తుఫాన్ తీవ్రత కారణంగా మహారాష్ట్ర, గుజరాత్, గోవా సీఎంలతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడి ప్తనీవివరాలు తెలుసుకున్నారు. తుఫాన్ దెబ్బకు ఆయా రాష్ట్రాలలో భారీగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. తుఫాన్ ప్రభావంతో మహారాష్ట్ర, గోవా, తెలంగాణ, కర్ణాటకలో ఇవాళ కూడా వర్షాలు పడతాయని వాతావరణశాఖ తెలిపింది. అటు తౌకతే తుఫాన్ కారణంగా హైదరాబాద్‌లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి.

# ఇక వెంటనే ఆర్టీపీసీఆర్ ఫలితాలు : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్ నగర్, మే 18: ఇక వెంటనే ఆర్టీపీసీఆర్ ఫలితాలు వస్తాయని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీపీసీఆర్ మెషిన్ ను ఆయన ప్రారంభించారు. ఖీ ? ఖఅఖీ టెస్టింగ్, రిపోర్ట్ కోసం మాన్యువల్ పద్ధతిలో 6 గంటల సమయం పట్టేదన్నారు. కానీ ఈ కొత్త పరికరంతో రెండున్నర గంటల్లోనే రిపోర్ట్ వస్తుందన్నారు.తద్వారా ప్రతి రోజు ఎక్కువ టెస్టులు చేసి వేగంగా రిపోర్ట్స్ అందించవచ్చన్నారు. తొందరగా వ్యాధి నిర్ధారణ చేయడంతో సంబంధిత వ్యక్తిని వెంటనే ఐసోలేట్ చేసి ఇతర కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వారికి వ్యాపించడాన్ని నిరోధించవచ్చన్నారు.సీఎం కేసీఆర్ దార్శనికత వల్లే రాష్ట్రంలో వైద్య రంగం ఎంతో మెరుగు పడుతుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ డైరెక్టర్ పుట్టా శ్రీని వాస్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏపీలో కర్ఫ్యూ సమయం తగ్గించారంటూ ప్రచారం

కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది. దీంతో ఉ.6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కర్ఫ్యూ అమలులో ఉంటుంది. తాజాగా ఈ కర్ఫ్యూను ఈనెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈనెల 20 నుంచి కర్ఫ్యూ సమయాన్ని ఉ.6 గంటల నుంచి ఉ.10 గంటల వరకు మాత్రమే కుదించినట్లు మంగళవారం నాడు పలు వాట్సాప్ గ్రూప్‌లలో వార్తలు హల్‌చల్ చేసింది. అయితే ఈ వార్త నిజం కాదని, కర్ఫ్యూ సమయం తగ్గింపుపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన జారీ చేయలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఓ ప్రతినిధి ఇచ్చిన తప్పుడు సమాచారంతో సోషల్ మీడియాలో ఈ వార్త వైరల్ అయినట్లు తెలుస్తోంది.

# మరోసారి పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

హైదరాబాద్ , మే 18: చమురు కంపెనీలు వాహనదారులకు మళ్లీ షాక్ ఇచ్చాయి. మంగళవారం మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాయి. ఒక రోజు విరామం అనంతరం ధరలు పైకి కదిలాయి. గత కొద్ది రోజులుగా కంపెనీలు రోజు విడిచి రోజు పెంచుతూ వస్తున్నాయి. ఈ నెలలో ఇప్పటి వరకు చమురు కంపెనీలు పదిసార్లు ధరలను పెంచాయి. ఓ వైపు కరోనా మహమ్మారి సమయంలో ఇంధన ధరలు గత కొద్ది రోజులుగా పైపైకి వెళ్తుండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే దేశంలో ఇంధన ధరలు రికార్డు స్థాయికి చేరాయి.

తాజాగా లీటర్ పెట్రోల్‌పై 27 పైసలు, లీటర్ డీజిల్‌పై 31 పైసలు పెంచాయి. పెంచిన ధరలతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.92.58, డీజిల్ రూ.83.51కు చేరింది. మరో వైపు దేశ ఆర్థిక రాజధాని ముంబైలో వందకు చేరువైంది. ప్రస్తుతం పెట్రోల్ రూ.99.14, డీజిల్, రూ.90.71కు చేరింది. కోల్‌కతాలో పెట్రోల్ రూ.92.92, డీజిల్ రూ.86.35, చెన్నైలో పెట్రోల్ రూ.94.54, డీజిల్ రూ.88.34, హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.96.50, డీజిల్ రూ.91.04, జైపూర్‌లో పెట్రోల్ రూ.99.30, డీజిల్ రూ.92.18, బెంగళూరులో పెట్రోల్ రూ.95.94, డీజిల్ రూ.88.53కి చేరాయి. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో అత్యధికంగా రికార్డు స్థాయిలో లీటర్ పెట్రోల్ ధర రూ.103.80, డీజిల్ రూ.96.30 చేరింది.

# దార్శనికుడు సీఎం కేసీఆర్ : మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, మే 18: : తెలంగాణ ఏర్పాటు తర్వాత ఎక్కడ ఏం చేపట్టాలి అన్నది సీఎం కేసీఆర్‌కు ముందే అవగాహన ఉందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

తెలంగాణ నవ నిర్మాణం గురించి కేసీఆర్ 2001 లోనే స్పష్టమైన ప్రణాళిక నిర్దేశించుకున్నారని, ఆకలి చావుల తెలంగాణను ఏడేళ్లలో కేసీఆర్ అన్నపూర్ణగా మార్చారన్నారు.

వైద్యం పూర్తిగా ప్రభుత్వ పరిధిలో ఉండాలన్నది సీఎం కేసీఆర్ ఆలోచన. దానిని దృష్టిలో ఉంచుకునే కేసీఆర్ ఆదిలాబాద్, మహబూబ్ నగర్, సూర్యాపేట, సిద్దిపేటలలో నూతన వైద్య కళాశాలలు ప్రారంభించారన్నారు.

నూతనంగా వనపర్తితో కలిపి ఆరు మెడికల్ కళాశాలలు, దాంతో పాటు నర్సింగ్ కళాశాలలు మంజూరు చేయడం దేశానికే ఆదర్శమన్నారు.

వనపర్తిలో మెడికల్ కళాశాలతో దక్షిణ పాలమూరు జిల్లాకు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. 2018 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# యాదాద్రి పవర్ ప్లాంట్‌లో హాస్పిటల్ నిర్మాణం

నల్లగొండమే 18: యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం జరుగుతున్న ప్రాంగణంలో ప్రత్యేక దవాఖానను నిర్మిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి వెల్లడించారు. పది రోజుల్లో నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించేలా ఏర్పాట్లు జరగాలని ఆయన అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్ల పాలెం వద్ద సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ఆయన మంగళవారం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావుతో కలసి సందర్శించారు.

అనంతరం యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టిన బీహెచ్‌ఈఎల్ అధికారులతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కొవిడ్ సెకండ్ వేవ్ ఉధృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. పనుల్లో జాప్యం జరగకుండా ఉండేందుకు గాను కార్మికుల్లో ధైర్యాన్ని పెంపొందించేందుకు గాను చేపట్టాల్సిన చర్యలపై మంత్రి దిశా నిర్దేశం చేశారు.

కొవిడ్ నేపథ్యంలో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మిస్తున్న ప్రాంగణంలోనే 20 పడకల ప్రత్యేక దవాఖాన నిర్మించాలని నిర్ణయించారు. దానిని10 రోజుల్లో పూర్తి చేయడం తో పాటు అవసరమైన వైద్య సిబ్బందిని నియమించాలని ఆయన సూచించారు. తద్వారా కార్మికుల్లో మనోధైర్యాన్ని పెంపొందించడం తో పాటు సిబ్బంది కి వైద్య సదుపాయం



అందుబాటులో ఉంచగలుగుతామన్నారు.

సమావేశంలో బీహెచ్‌ఈఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ సిసోడియా, ట్రాన్స్‌కో డైరెక్టర్లు అజయ్, సచ్చితానంద్, టీ ఆర్ కే రావు, కోల్ సీఎండీ జె యస్ రావు, ఎస్‌ఈ హనుమంత తదితరులు పాల్గొన్నారు.

# సింగపూర్ స్ట్రెయిన్ తో థర్డ్ వేవ్ ముప్పు : కేజ్రీవాల్

న్యూఢిల్లీ : సింగపూర్ లో చిన్నారుల్లో వ్యాపిస్తున్న కరోనా వైరస్ నూతన స్ట్రెయిన్ పట్ల ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ లో కొవిడ్-19 థర్డ్ వేవ్ వ్యాప్తిలో సింగపూర్ కొవిడ్ స్ట్రెయిన్ విరుచుకుపడవచ్చని పేర్కొన్నారు. సింగపూర్ నుంచి విమాన రాకపోకలను తక్షణమే నిలిపివేయాలని, చిన్నారులకు కొవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

సింగపూర్ స్ట్రెయిన్ చిన్నారులకు ప్రమాదకరంగా మారుతుందని చెబుతున్నారని, ఇది థర్డ్ వేవ్ రూపంలో భారత్‌ను తాకవచ్చని కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులను కాపాడుకునేందుకు మనం వారికి వ్యాక్సినేషన్ ప్రక్రియను ముమ్మరం చేయాలని ఆయన ట్వీట్ చేశారు.

# భయం వద్దు.. బ్లాక్ ఫంగస్ అంటువ్యాధి కాదు

హైదరాబాద్ , మే 18: బ్లాక్ ఫంగస్ అంటువ్యాధి కాదని, దాంతో భయపడవద్దని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు ఎస్‌కెఈ అప్పారావు వెల్లడించారు. ప్రస్తుతం ప్రజానీకాన్ని వణికిస్తున్న బ్లాక్ ఫంగస్ (మ్యూకార్‌మైకోసిస్) కొత్తదేమీ కాదని, తెలియని వ్యాధి అంతకంటే కాదని ఆయన పేర్కొన్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ ఓటాలజీ పూర్వపు అధ్యక్షుడు అయిన ఆయన ప్రస్తుతం ప్రజానీకానికి దడపుట్టిస్తున్న బ్లాక్ ఫంగస్‌ను నివారించేందుకు ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ ఎంపోటెర్సిన్ బి ఇంజక్షన్‌ను 4-6 వారాలు వినియోగించడం ద్వారా అదుపు చేయవచ్చని సూచించారు.

ఈ వ్యాధి అంటువ్యాధి కాదని అయితే కొన్ని గంటలు, రోజుల్లోనే ఉధృతరూపం దాల్చి రోగికి ప్రాణహాని చేస్తుందన్నారు. దీన్ని గుర్తించిన తక్షణమే వైద్యచికిత్స అందించడం ద్వారా రోగిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. కరోనా అనంతర వ్యాధిగా హైరిస్క్ గ్రూప్‌లలో ఇది ప్రస్తుతం కన్పిస్తుందన్నారు. కోవిడ్-19 నివారణ కోసం స్టెరాయిడ్స్ వినియోగం, ఆర్ద్రతతో కూడిన ఆక్సిజన్ థెరపీ, ఇమ్యూనినో మాడ్యూలేటర్స్ వినియోగం వంటివి బ్లాక్‌ఫంగస్ వ్యాధికి దోహదం చేస్తున్నాయన్నారు. వాతావరణంలో ఫంగస్, స్పోర్స్ విచ్చలవిడిగా వ్యాపించి ఉంటాయని వివరించారు. రోగి వ్యాధి నిరోధకత తగ్గిపోవడంతో పాటు నియంత్రణలో లేని మధుమేహం, ట్రాన్స్‌ప్లేంటీస్, ఎయిడ్స్, ల్యూకేమియా, కేన్సర్ వ్యాధి గ్రస్తులు మ్యూక్రో మైకోసిస్ (మ్యూకార్‌మైకోసిస్) బారినపడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర ప్రాంతంలో నెమ్మదిగా బ్లాక్ ఫంగస్ టెర్రర్ ప్రజల్ని వణికించే స్థాయికి ఎదుగుతుందన్నారు. అయితే దీనికి భయపడాల్సిన పరిస్థితులు లేవని ఈఎన్‌టీ, అఫ్తామాలజీ, న్యూరో, డెంటల్ సర్జన్లు, నెఫ్రాలజిస్ట్, జనరల్ ఫీజిషియన్‌ల బృందం ఈ వ్యాధికి సమర్థవంతంగా చికిత్స అందించగలుగుతున్నారని వివరించారు.

వ్యాధి గుర్తింపు ఇలా..

కోవిడ్ అనంతర రోగుల్లో గుర్తించిన వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని అప్పారావు సూచించారు. వైద్యులు ముక్కులోపలి భాగాన్ని ఎండోస్కోపిక్ ఎగ్జామినేషన్ చేసి నిర్ధారిస్తారన్నారు. అలాగే బయాప్సీ చేసి ఏ రకమైన ఫంగస్ ఈ వ్యాధికి కారణం మన్నది నిర్ధారిస్తారని వెల్లడిరచారు. ఎంఆర్ఐ స్కాన్ ద్వారా ఆయాభాగాల్లో తీవ్రతను గుర్తించి సకాలంలో సరైన వైద్యం అందించడం ద్వారా రోగిని రక్షిస్తారన్నారు. ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ ద్వారా ఫంగస్ సోకిన కణజాలాన్ని తొలగిస్తారన్నారు. దాంతో పాటు ఎంఫోటెర్సిన్ బి ఇంజక్షన్‌ను 4-6వారాలు ఇవ్వడం ద్వారా బ్లాక్ ఫంగస్ వ్యాధిని నివారించవచ్చన్నారు. బ్లాక్‌ఫంగస్/ మ్యూకార్‌మైకోసిస్ నివారించేందుకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయడంతో పాటు ఈఎన్‌టీ, అఫ్తామాలజీ, డెంటల్, న్యూరో సర్జన్ల బృందంతో పాటు నెఫ్రాలజీ, జనరల్ ఫిజీషియన్ల వైద్య బృందాన్ని ఆయా వార్డులో అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే కోవిడ్ రోగులకు స్టెరాయిడ్స్ వినియోగాన్ని సహేతుకంగా వినియోగించడం, మోతాదు మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు బ్లడ్‌గ్లూకోజ్ స్థాయిని అదుపులో ఉంచుకోవడం ద్వారా బ్లాక్ ఫంగస్ వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చని డాక్టర్ ఎస్‌కెఇ అప్పారావు వివరించారు. ఇంకా ఈ వ్యాధిపై అనుమానాలు ఉంటే 9160066564 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన సూచించారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ సతతమ్మాంగ్లేయులపై
ధీటుగా పోరాడునట్టి తేజోమయుడై
యతి సాహస వంతుడుగా
నతి శతములనందుకొనెను నానాసాహెబ్ !!

-రాధశ్రీ



(మే 19 పోరాట వీరుడు నానా సాహెబ్ జయంతి..)

సెల్: 9494481210

# పాజిటివిటీ రేటు 14.10 శాతం.. 1.8 శాతం జనాభాకు కోవిడ్

న్యూఢిల్లీ, మే 18: దేశంలో ఇవాళ వైరస్ పాజిటివిటీ రేటు 14.10 శాతంగా ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో కరోనా వైరస్ కేసుల సంఖ్య తగ్గుతోందన్నారు. మే 3వ తేదీన రికవరీ రేటు 81.7 శాతం ఉందని, అయితే ఆ రేటు ఇప్పుడు 85.6 శాతానికి చేరుకున్నట్లు ఆయన తెలిపారు.

గత 24 గంటల్లో వైరస్ నుంచి 4,22,436 మంది కోలుకున్నట్లు ఆయన చెప్పారు. దేశంలో ఇంత భారీ స్థాయిలో రికవరీ రేటు నమోదు కావడం ఇదే మొదటిసారి. అంటే కోవిడ్ రికవరీ కేసుల్లో పాజిటివ్ ట్రెండ్ మొదలైనట్లు లవ్ అగర్వాల్ స్పష్టం చేశారు. కొత్త కేసుల కన్నా రికవరీ కేసులే ఎక్కువగా ఉన్నాయి.

దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో లక్షకుపైగా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయని, 50 వేల నుంచి లక్ష మధ్య పది రాష్ట్రాలు, ఇక 50 వేల కన్నా లోపు యాక్టివ్ కేసుల్లో 18 రాష్ట్రాలు ఉన్నట్లు ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి శుక్లా తెలిపారు.

199 జిల్లాల్లో వైరస్ పాజిటివ్ కేసుల తరుగుదల కనిపించిందని, గత మూడు వారాల నుంచి పాజిటివ్ రేటు కూడా తగ్గిందన్నారు. ఇప్పటివరకు కోవిడ్ వ్యాధి దేశ జనాభాలో 1.8 శాతం మందికి వచ్చిందని, వైరస్ వ్యాప్తిని రెండు శాతం లోపు నియంత్రించినట్లు ఆయన తెలిపారు. అమెరికాతో పాటు ఇతర ప్రపంచదేశాల్లో ఎంత శాతం జనాభాకు వైరస్ సంక్రమించిందన్న డేటాను ఆయన ప్రజెంట్ చేశారు.

# గర్భిణుల చికిత్స కోసం ప్రత్యేక దవాఖాన ఏర్పాటు

పెద్దపల్లి మే 18: జిల్లాలో కరోనా బారిన పడిన గర్భిణుల చికిత్స, డెలివరీ కోసం దవాఖాన ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు. మంగళవారం సుల్తానాబాద్ లోని ప్రభుత్వ హాస్పిటల్‌ను కలెక్టర్ పరిశీలించారు. కరోనా బారినపడిన గర్భిణులకు చికిత్స అందించేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కరోనా చికిత్స అందించేందుకు వీలుగా ప్రభుత్వ దవాఖానల్లో పడకల సంఖ్య పెంచుతున్నామని కలెక్టర్ తెలిపారు.

కరోనా చికిత్స అందించేందుకు అవసరమైన అన్ని పరికరాలను అందుబాటులో ఉంచామని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి, మంథని, గోదావరిఖనిలలో ఐసోలేషన్ లో ఉండే వారి కోసం ప్రత్యేక కేర్ సెంటర్లు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. కరోనా పాజిటివ్ వచ్చిన గర్భిణులు డెలివరీ కొసం ఇబ్బంది పడకుండా సుల్తానాబాద్ ప్రభుత్వ దవాఖానలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లాలోని మిగతా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో కొవిడ్ లేని గర్భిణులకు డెలివెరీలు చేస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు.





# రూ.48 వేలకు చేరువలో బంగారం

న్యూఢిల్లీ, మే 18: దేశంలో బంగారం ధరలు క్రమం తప్పకుండా పెరిగిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.333 పెరిగి రూ.47,833కు పెరిగింది. క్రితం ట్రేడ్‌లో తులం స్వచ్ఛమైన బంగారం ధర రూ.47,500 వద్ద ముగిసింది. ఇంటర్నేషనల్ మార్కెట్‌లలో విలువైన లోహాల ధరలు స్వల్పంగా పెరుగడమే దేశీయంగా బంగారం ధరలు స్వల్పంగా పెరుగడానికి కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ నిపుణులు తెలిపారు.

ఇక వెండి ధరలు కూడా ఇవాళ భారీగా పెరిగాయి. ఢిల్లీలో ఇవాళ కిలో వెండి ధర రూ.2,021 పెరిగి రూ.73,122కు చేరింది. క్రితం ట్రేడ్‌లో కిలో వెండి ధర రూ.71,101 వద్ద ముగిసింది. కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లలో ఇవాళ ఔన్స్ బంగారం ధర 1,869 అమెరికన్ డాలర్‌లు, ఔన్స్ వెండి ధర 28.48 అమెరికన్ డాలర్‌లు పలికింది.

# కోవిడ్ చికిత్సకు వినియోగించే 2-డీజీ ఔషధాన్ని విడుదల చేసిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి

హైదరాబాద్ , మే 18: కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ హర్ష్ వర్ధన్ ఈ రోజు డీఆర్‌డీఓ భవన్‌లో దేశీయంగా తయారు చేసిన కోవిడ్ ఔషధం 2-డీజీని విడుదల చేశారు. ఈ సరికొత్త కోవిడ్ ఔషధపు 2-డియోక్సీ-డి-గ్లూకోజ్ (2-డీజీ), అనువర్తనాన్ని హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీ (డీఆర్ఎల్)తో కలిసి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ మెడిసిన్ అండ్ అలైడ్ సైన్సెస్ (ఐఎన్ఎంఏఎస్), రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ప్రయోగశాలలో అభివృద్ధి చేశారు. సరికొత్త 2-డీజీ ఔషధం తొలి సాచెట్ల పెట్టను న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియాకు, కేంద్ర ఆర్మ్డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ (ఏఎఫ్ఎంఎస్) లెఫ్టినెంట్ జనరల్ శ్రీ సునీల్ కాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి డాక్టర్ హర్ష్ వర్ధన్ మాట్లాడుతూ ఈ రోజు కోవిడ్ వ్యతిరేకంగా మనం చేస్తున్న పోరాటంలో ఒక చారిత్రాత్మక రోజు అని వ్యాఖ్యానించారు. దేశీయంగా తొలిసారి కోవిడ్-19 చికిత్స ఔషధాన్ని అభివృద్ధి చేసేందుకు గాను విశేషంగా ప్రయత్నించిన శాస్త్రవేత్తల కృషిని ప్రశంసించారు.

ఔషధం అభివృద్ధి చేసినందుకు వారి చూపిన సహనం మరియు పట్టుదలను మరియు డీఆర్‌డీఓ కృషిని అభినందించారు. కోవిడ్ మహమ్మారికి వ్యతిరేకంగా

మనం చేస్తున్న పోరులో ఇది ఒక సరికొత్త అధ్యాయానికి తెర తీసే అవకాశం ఉందని అన్నారు. ఈ ఔషధం ఆక్సిజన్‌పై రోగుల ఆధారపడటాన్ని తగ్గిస్తుంది.

కోవిడ్ చికిత్సకు ఈ ఔషధం ఎంతో విభిన్నంగా మరియు ఎంచుకున్న పద్ధతిలో పని చేసే అవకాశం ఉంది. కోవిడ్ సోకిన వివిధ కణాలలో ఇది వైరస్ సంశ్లేషణ మరియు ప్రక్రియ కోసం శక్తి ఉత్పత్తిని నిరోధిస్తుంది. ఈ ఔషధం యొక్క క్లినికల్ ట్రయల్స్‌లో ముప్పయి ఆస్పత్రులు పాల్గొన్నాయని మంత్రి డాక్టర్ హర్ష్ వర్ధన్ పేర్కొన్నారు. సరికొత్త ఔషధం ఎంపిక చేసి కణాల్లోకి వెళ్లి వైరస్ సంశ్లేషణను నివారిస్తుంది. కోవిడ్ రోగులు కోలుకునే సమయాన్ని తగ్గిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్ష్ వర్ధన్ రక్షణ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రక్షణ మంత్రిత్వ శాఖ, డీఆర్‌డీఓ కృషి కారణంగా ఢిల్లీ, దేశవ్యాప్తంగా అనేక పీఎస్ఏ

ప్లాంట్లను విజయవంతంగా ఏర్పాటు చేయడమైందని తెలిపారు. మన సమిష్టి ప్రయత్నాల ద్వారా మరియు కోవిడ్‌కు తగిన ప్రవర్తనను అనుసరించడం ద్వారా మనం మహమ్మారికి వ్యతిరేకంగా జరుపుతున్న యుద్ధంలో తప్పక విజయాన్ని సాధిస్తామని చెప్పారు. కోవిడ్‌పై పోరుకు సరికొత్తగా రూపొందించిన ఈ ఔషధం

రోగులను ప్రాణాంతక వైరస్ నుంచి బయటపడేయటంలో సహాయపడుతుందని రక్షణ శాఖ ఆర్అండ్‌డీ విభాగం కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ డాక్టర్ జి సతీష్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన డీఆర్ఎల్ కోవిడ్-19 మందును ముందుకు తీసుకెళ్లి త్వరలోనే రోగులకు అందుబాటులోకి తేగలదన్న

విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో పాల్గొన్న డీఆర్ఎల్ ఛైర్మన్ శ్రీ కల్లం సతీష్ రెడ్డి మాట్లాడుతూ " 2-డీజీ అభివృద్ధిలో డీఆర్‌డీఓ మరియు ఐఎన్ఎంఏఎస్ సంస్థలతో భాగస్వామ్యం కావడం డాక్టర్ రెడ్డి సంస్థకు ఆనందంగా ఉందన్నారు. కోవిడ్ చికిత్స ఔషధం, వ్యాక్సిన్ ద్వారా మహమ్మారిని రూపుమాపేందుకు సమస్యను పరిష్కరించడానికి.. తమ కంపెనీ చేస్తున్న వివిధ ప్రయత్నాలను పునరుద్ఘాటిస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్, హెల్త్ సర్వీసెస్ డీజీ డాక్టర్ సునీల్ కుమార్, ఎయిమ్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎల్ సంస్థ ఛైర్మన్, సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ మిశ్రాతో పాటుగా దేశ వ్యాప్తంగా అనేక మంది వైద్యులు, ఆసుపత్రుల వారు మరియు ప్రయోగశాలల వారు ఈ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

# కోవిడ్ ప్రభావిత పిల్లలకు 'సంవేదన' ద్వారా టెలి కౌన్సిలింగ్

హైదరాబాద్ , మే 18: కోవిడ్-19తో ప్రభావితమైన పిల్లలకు బాలల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటైన నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ( ఎన్‌సిపిసిఆర్) సంవేదన ( సెన్సిటైజింగ్ యాక్షన్ ఆన్ మెంటల్ హెల్త్ త్రూ వెల్నరబిలిటీ త్రూ ఎమోషనల్ డెవలప్మెంట్ అండ్ నేసేసరి ఆక్సిప్టెన్స్ ) ద్వారా టెలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వారిలో మానసిక ధైర్యాన్ని అందిస్తోంది

. కోవిడ్-19 వల్ల పిల్లలు మానసిక సమస్యలకు గురికాకుండా చూడాలన్న లక్ష్యంతో ఎన్‌సిపిసిఆర్ ఈ సౌకర్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. నిపుణులు/కౌన్సిలర్లు/మనస్తత్వవేత్తలు ఉచితంగా టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా పిల్లలకు ధైర్యాన్ని కలిగిస్తున్నారు. నిమ్హాన్స్ ( నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్) తమిళం, తెలుగు, కన్నడ, ఒరియా, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ వంటి వివిధ ప్రాంతీయ భాషలలో ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. 2020 సెప్టెంబరులో ఈ సౌకర్యం ప్రారంభమయ్యింది. కోవిడ్ సమయంలో సమస్యలను ఎదుర్కొంటున్న పిల్లలకు అండగా నిలబడానికి నిమ్హాన్స్ ఈ సేవలను ప్రారంభించింది.

నిమ్హాన్స్ లోని పిల్లల మరియు కౌమార మనోరోగచికిత్స విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శేఖర్ శేషాద్రి, ఆయన బృంద సభ్యులు వివిధ టెలీ కౌన్సిలింగ్ విధానాల ద్వారా కోవిడ్-19కి సంబంధించిన వివిధ అంశాలపై పిల్లలకు అవగాహన కల్పిస్తూ వారికి మానసికస్థైర్యాన్ని కలిగిస్తోంది.

కోవిడ్-19 వల్ల తమకు ఎదురవుతున్న ఒత్తిడి, ఆందోళన, భయం మరియు ఇతర సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 1800-121-2830 ద్వారా పిల్లలు తమ మాతృ భాషలో సంవేదన కు వివరించి నిపుణుల సలహాలు సూచనలను పొందవచ్చును. ఈ సౌకర్యం సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు తిరిగి మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు అందుబాటులో ఉంటుంది. సమస్యను వివరించి కౌన్సిలింగ్ ద్వారా పరిష్కారం పొందాలనుకునే పిల్లలకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. మూడు తరగతుల్లో కౌన్సిలింగ్ సేవలు పిల్లలకు అందిస్తున్నారు.

# తెలంగాణలో ఉద్యోగ నియామకాలపై షర్మిల గళం

హైదరాబాద్ , మే 18: తెలంగాణ సీఎంపై వైయస్ షర్మిల ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ సారుకు కాంట్రాక్టు ఉద్యోగాలే ముద్దుగా ఉన్నాయని విమర్శించారు. సీఎం పదవిని కూడా కాంట్రాక్టు కింద పెట్టుకుంటే పోలే అని ఎద్దేవా చేశారు. కరోనా విజృంభిస్తున్న వేళ కాంట్రాక్టుపై వైద్య సిబ్బందిని నియమించాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించుకుందని అన్నారు. 2017లో 3,311 స్టాఫ్ నర్సులకు నోటిఫికేషన్ ఇచ్చిన టీఆర్ఎస్ సర్కారు? అర్హత సాధించిన ఇంకా 658 మందికి మాత్రం ఉద్యోగాలు కల్పించలేదని షర్మిల దుయ్యబట్టారు. ఇప్పుడు కాంట్రాక్టు పద్ధతిన నర్సింగ్ సిబ్బందిని తీసుకోవాలనుకుంటున్న ప్రభుత్వం? ముందు అర్హత సాధించిన 658 మందిని పర్మినెంట్ గా ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి తోడు 'తాత్కాలిక పోస్టులకే పిలుపు' అంటూ ఓ వార్తాపత్రికలో వచ్చిన వార్తా కథనాన్ని ఆమె షేర్ చేశారు

# గ్రామాలకు పాకుతున్న కరోనా సునామీ..!

కరోనా రెండవ సునామీ తాకిడికి భారతమంతా అట్టుడికి పోతున్నది. కరోనా కేసులు గత 22 రోజులుగా రోజుకు 3.5 లక్షలు దాటుతూ, కోవిడ్-19 మరణాలు 3 - 4 వేలుగా నమోదు అవుతున్నాయి. గత వారం డబ్ల్యూహెచ్ఓ నివేదిక ప్రకారం ప్రపంచ కరోనా కేసుల్లో 50 శాతం మరియు కోవిడ్-19 కారణ మరణాల్లో 30 శాతం ఇండియాలోనే జరుగుతున్నాయని తేలుతోంది. నమోదు కాని కేసులు/ మరణాల అంచనాలు ఐదు రెట్లు అధికంగా ఉండవచ్చని అంటున్నారు. ఎటు చూసిన కొరతల అరుపులు, శవాల కుప్పలు దర్శనమిస్తున్నాయి. కరోనా కేసుల సంఖ్యలో ఆంధ్ర ప్రదేశ్ ఐదవ స్థానంలో నిలుస్తోంది. ఆసుపత్రుల్లో బెడ్లు ఖాళీ లేవు. ప్రాణవాయువు అందడం లేదు. కోవిడ్-19 ఔషధాల నకిలీ కొరతలు 'రోగుల పుండు మీద కారం' చల్లుతున్నాయి. మహనగరాల్లోంచి జిల్లా కేంద్రాలను చుట్టేసిన కరోనా విష తరంగం నేడు మండల స్థాయి మేజర్ గ్రామ పంచాయితీలకు పాకింది. నేడు మండల స్థాయి పంచాయితీల నుండి గ్రామాలకు వేగంగా విస్తరిస్తోంది. గ్రామీణ భారతంలో మార్చిలో 21 శాతం నమోదైన కరోనా కోసులు ఏప్రిల్-2021లో 30 శాతానికి పెరిగాయని గణాంకాలు తెలుపుతున్నాయి.

కరోనా రెండవ అల వ్యాప్తితో గ్రామీణ పేదలు అర్ధ ఆకలితో రోజులు గడుపుతూ, దయనీయ పరిస్థితిలో బతుకుతున్నారని విశ్లేషణలు వివరిస్తున్నాయి. ఆకలి కడుపులతో బక్కచిక్కిన గ్రామీణ భారతంపై కరోనా పంజా విసిరితే దేశ పరిస్థితి 'పెనం లోంచ పొయ్యిలో పడినట్లు' అవుతుంది. ఇప్పుడు మారుమూల గ్రామాల్లో కూడా కరోనా కేసులు బయట పడడంతో గ్రామీణులు భయంతో ఉలిక్కి పడుతున్నారు. గ్రామాలు కరోనా కోరల్లో బంధీలు అయితే వైద్య సదుపాయాలు అరకొరగా కూడా లేనందున మరణాల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. దేశానికి వెన్నెముక అయిన రైతు నడ్డి విరిగి వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు కుంటుపడతాయి. కోవిడ్-19 వైద్యం పొందలేక కర్షక శ్రామిక లోకం ప్రాణాలు వదలాల్సిన దుస్థితి రాక ముందే ఆపన్నులను ఆదుకోవలసిన కనీక బాధ్యత సర్కారు తీసుకోవాలి. దీనికి గాను కోవిడ్-19 సంక్షోభం సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ ప్రాధాన్యతలను పునర్ సమీక్షించుకొని పట్టుదలతో నడవాల్సి ఉంది. త్వరితగతిన టీకా ఉద్యమాన్ని చేపడుతూనే వైద్య ఆరోగ్య వసతులను గ్రామీణ స్థాయి వరకు విస్తరించాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో ప్రారంభమై గ్రామపంచాయితీల వరకు కరోనా సేవలు వికేంద్రీకరించాల్సి ఉంది.

ఇండియాలో దాదాపు వైద్య వసతులు 70 శాతం పట్టణాల్లోనే (30 శాతం జనాభా) కేంద్రీకరించబడి, 70 శాతం గ్రామీణ జనాభాకు అందుబాటులో లేకుండా దూరమైనాయి. గ్రామీణుల్లో కరోనా పరీక్షలకు 6 - 10 కిమీ దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెల్లడానికి కూడా పల్లె జనం ముందుకు రావడం లేదు. అనారోగ్యంగా ఉన్నప్పటికీ భయపడి బయట పెట్టడం లేదు. కరోనా నిర్ధారించబడినా తమ వ్యవసాయ పనులు కుంటు పడతాయనే భయంతో ఇంట్లో క్వారంటైన్ కావడానికి సిద్ధంగా లేరు. ఈ దుస్థితిలో కరోనా వ్యాప్తి వేగంగా పెరగడం తప్పనిసరి అయ్యింది. తక్కువ తీవ్రత ఉన్న వారు కొన్ని రోజులకు కోలుకోవచ్చు, కాని కోవిడ్-19 తీవ్రత అధికంగా ఉన్న ప్రజలు ఆలస్యంగా ఆసుపత్రులు చేరడం, చివరికి ప్రాణాలు కోల్పోవడం జరుగవచ్చు. రాష్ట్ర జిల్లా స్థాయిలో కరోనా కేసులను మరియు మరణాల వాస్తవ వివరాలు ప్రకటించాలి. రాష్ట్ర స్థాయి కేసులు మరియు మరణాల వివరాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఆక్సీజన్, ఔషధాల కోటాను రాష్ట్రాలకు విడుదల చేస్తుందని మరువరాదు. పట్టణ ఆసుపత్రులు మరియు గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై కూడా పని భారం అధిక పడుతున్నది. యూపీలోని ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 200 గ్రామాలు ఉన్నాయంటే నమ్మశక్యంగా లేదు. గ్రామ పంచాయితీల వారీగా కరోనా కేసులను గుర్తించి, వారిని నిత్యం పర్యవేక్షణ చేసే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. కరోనా పాజిటివ్ గ్రామీణులకు అత్యవసర ఔషధాల కిట్లను అందించడంతో పాటు గ్రామపంచాయితీ కార్యాలయంలో ఆక్సీమీటర్లు మరియు థర్మామీటర్లు అందుబాటులో ఉంచాలి. కరోనా కట్టడికి అంగన్ వాడీ మరియు ఆశ వర్కర్ల సేవలను వినియోగించుకొని ఇంటింట సర్వే నిర్వహణ మరియు అనారోగ్యులను గుర్తించడం, వైద్య సేవలు అందించడం రోజు వారీ దినచర్యగా నిర్ధేశించాలి. గ్రామీణ కరోనా కేసులను తొలి దశలోనే నిర్ధారించి, వెంటనే కోవిడ్-19 కిట్ అందించి, ఇంట్లోనే వైద్యం అందించే ప్రయత్నం చేయాలి. కరోనా రెండవ అల సునామీ ఉధృతిని తట్టుకొని నిలవటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు గ్రామపంచాయితీలు సమన్వయంతో ఏకతాటిపై నిలిచి, కరోనా విష కోరల్ని పీకేసి, దేశ అన్నదాతలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, గ్రామీణ భారతాన్ని ఆరోగ్య తోరణాలతో అలంకరిద్దాం.అదృష్ట శత్రువైన మహా మహమ్మారిని మన వైపు చూడకుండా తరిమేద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# కోవిడ్ పరిస్థితిపై చర్చకు దేశంలోని వైద్యుల బృందంతో ప్రధానమంత్రి సమావేశం

హైదరాబాద్ , మే 18: కోవిడ్ సంబంధిత పరిస్థితులపై చర్చించడం కోసం దేశవ్యాప్తంగాగల వైద్యుల బృందంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ దృశ్య-శ్రవణ మాధ్యమంద్వారా సమావేశమయ్యారు. కోవిడ్ రెండోదశ అసాధారణ పరిస్థితులపై ఆదర్శప్రాయ పోరాటం చేస్తున్న వైద్య లోకానికి, అనుబంధ విధుల సిబ్బందికి ప్రధాని ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ, ఇందుకుగాను దేశం మొత్తం వారికి రుణపడి ఉన్నదని చెప్పారు. రోగ నిర్ధారణ పరీక్షలు, మందుల సరఫరా లేదా రికార్డు సమయంలో కొత్త మౌలిక వసతుల కల్పన... అది ఏదైనప్పటికీ ఇవన్నీ అత్యంత వేగంగా అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన గుర్తుచేశారు. ఆక్సిజన్ ఉత్పత్తి, సరఫరాలో ఎదురైన అనేక సమస్యలను త్వరగానే అధిగమించామని పేర్కొన్నారు. మానవ వనరుల పెంపు దిశగా మన దేశం చేపట్టిన చర్యల్లో కోవిడ్ చికిత్స కోసం 'ఎంబీబీఎస్' విద్యార్థులను నియమించడం, గ్రామీణ ప్రాంతాల్లో సేవల బాధ్యతను 'ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు అప్పగించడం వంటివి ఆరోగ్య వ్యవస్థకు అదనపు మద్దతునిచ్చాయని పేర్కొన్నారు.

కోవిడ్‌పై పోరులోగల ముందువరుస యోధులతో టీకాల కార్యక్రమం ప్రారంభించే వ్యూహం రెండో దశలో ఎనలేని ఫలితాలనిచ్చిందని ప్రధానమంత్రి అన్నారు. ఇందులో భాగంగా దేశంలోని ఆరోగ్యరంగ సిబ్బందిలో దాదాపు 90 శాతం టీకా తొలి మోతాదు తీసుకున్నారని గుర్తుచేశారు. ముఖ్యంగా వైద్యులలో అనేకమందికి టీకాలు ఎంతో భరోసానిచ్చాయని పేర్కొన్నారు.

ఆక్సిజన్ వినియోగంపై పర్యవేక్షణను వైద్యులు తమ రోజువారీ విధుల్లో భాగం చేసుకోవాలని ప్రధానమంత్రి కోరారు. పెద్ద సంఖ్యలో రోగులు 'ఏకాంత గృహవాస చికిత్స' పొందుతున్నారని గుర్తుచేస్తూ- ఈ గృహాధార వైద్య సంరక్షణకు ప్రామాణిక విధాన ప్రక్రియ తప్పనిసరి ప్రాతిపదికగా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రోగులకు 'ఏకాంత గృహవాస చికిత్స'లో దూరవాణి వైద్యసేవ ప్రధాన పాత్ర పోషిస్తున్నదని ఆయన చెప్పారు. ఈ సేవలను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యులు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో దూరవాణి సేవలు అందించడంపై వారిని కొనియాడారు. అన్ని రాష్ట్రాల్లో ఇటువంటి బృందాల ఏర్పాటు చేయాలని, తుది సంవత్సరం 'ఎంబీబీఎస్' విద్యార్థులతోపాటు శిక్షణలోగల విద్యార్థి వైద్యులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా దేశంలోని అన్ని జిల్లాలు, తాలూకాల్లో దూరవాణి వైద్యసేవలకు భరోసా దిశగా కృషిచేయాలన్నారు. బ్లాక్ ఫంగస్ లేదా మ్యూకోర్‌మైకోసిస్ సవాలుపైనా ప్రధానమంత్రి వైద్యులతో చర్చించారు. దీనిపై చురుకైన చర్యల దిశగా వైద్యులు మరింత కృషి చేయాలని, అలాగే దీనిపై అవగాహన పెంచడానికీ ప్రయత్నించాల్సి ఉందని ఆయన అన్నారు. శారీరక సంరక్షణకుగల ప్రాధాన్యంతోపాటు మానసిక సంరక్షణ ప్రాముఖ్యాన్ని ఈ సందర్భంగా ప్రధాని నొక్కిచెప్పారు. వైరస్‌పై ఈ సుదీర్ఘ యుద్ధంలో నిరంతరం పోరు సాగించాల్సిన పరిస్థితి వైద్య లోకానికి మానసికంగా సవాలు అనడంలో సందేహం లేదన్నారు. అయితే, ఈ పోరాటంలో వారిపై పౌరులకుగల విశ్వాసం ఇచ్చే శక్తి ఆయుధం కాగలదని చెప్పారు.దేశవ్యాప్తంగా ఇటీవల కేసుల విజృంభించినపుడు ప్రధానమంత్రి మార్గదర్శనంపై ఈ సమావేశంలో వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు. టీకాలివ్వడంలో ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలకు అగ్ర ప్రాధాన్యం ఇవ్వడంపై వైద్యులు ఆయనకు ధన్యవాదాలు చెప్పారు. కోవిడ్ తొలిదశతోపాటు రెండోదశలో ఎదురైన సవాళ్లదాకా తమ సంసిద్ధత గురించి వారు ప్రధానికి తెలియజేశారు. అలాగే తమ అనుభవాలు, అనుసరించిన ఉత్తమ పద్ధతులు, వినూత్న కృషి తదితరాలను ఆయనతో పంచుకున్నారు. మహమ్మారిపై పోరాటంసహా కోవిడేతర రోగులకు సముచిత సంరక్షణలోనూ వీలైనంత కృషి చేశామని చెప్పారు. ప్రజల్లో అన్నివిధాలా అవగాహన పెంపు, మందుల అనుచిత వాడకంపై చైతన్యం తేవడం వంటి అంశాలపై తమ అనుభవాలను తెలిపారు. నీతి ఆయోగ్ (ఆరోగ్య విభాగం) సభ్యుడితోపాటు ఆరోగ్య, ఔషధ శాఖల కార్యదర్శులు, ప్రధాని కార్యాలయంసహా కేంద్ర ప్రభుత్వంలోని ఇతర శాఖల అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కఠినమైన సమయాల్లో అవసరమైన వైద్య సామాగ్రిని సులభతరం చేస్తున్న చెన్నై విమానాశ్రయం



హైదరాబాద్ , మే 18: భారతదేశంలోని వివిధ విమానాశ్రయాలు మరియు వాటికి సంబంధించిన కరోనా యోధులు దేశవ్యాప్తంగా అవసరమైన వైద్య సామాగ్రిని తరలించడానికి మరియు పంపిణీ చేయడానికి రాత్రింబవళ్ళు కృషి చేస్తున్నారు. కోవిడ్ -19 మహమ్మారితో దేశం చేస్తున్న పోరాటానికి వైద్య సామాగ్రి రవాణా చేయడంలో చెన్నై విమానాశ్రయం దక్షిణ భారతదేశంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. 2021 జనవరి 12 నుండి 15 మే 2021 వరకు చెన్నై విమానాశ్రయం దేశీయంగా 44.26 మెట్రిక్ టన్నుల ఇన్‌బౌండ్ వ్యాక్సిన్ మరియు సంబంధిత సరుకును నిర్వహించింది. అందుకున్న టీకాల్లో ఎక్కువ భాగం పూణే / ముంబై విమానాశ్రయాల ద్వారా కోవిషీల్డ్ వ్యాక్సిన్ రవాణా మరియు హైదరాబాద్ విమానాశ్రయం ద్వారా కోవాక్సిన్ వ్యాక్సిన్ రవాణా ఉంది.ఏఏఐసిఎల్ఎఎస్ (ఏఏఐ కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ లిమిటెడ్) మరియు ఏఏఐ బృందం వ్యాక్సిన్‌లను సులువుగా సజావుగా పంపిణీ చేయడానికి ఒక ప్రత్యేకమైన వ్యాక్సిన్ కారిడార్‌ను ఏర్పాటు చేసింది. తద్వారా ఈ టీకాలు సమీప రాష్ట్రాలు మరియు జిల్లాలకు మరింత అనుసంధానించబడతాయి. 2021 మే 1 నుండి మే 15 వరకు చెన్నై విమానాశ్రయానికి 9.53 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు వచ్చాయి. అంతర్జాతీయంగా చెన్నై విమానాశ్రయం 2021 మే 15 వరకు 402.39 మెట్రిక్ టన్నుల వైద్య అవసరాలను పొందింది. వీటిలో చాలా వరకూ ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు మరియు హాంకాంగ్, షెన్‌జెన్, సింగపూర్, దోహా, కున్మింగ్, ఇస్తాంబుల్, బ్యాంకాక్, కౌలాలంపూర్ మరియు ఫ్రాన్స్ వంటి విదేశాల నుండి పొందిన వైద్య పరికరాలు ఉన్నాయి.

మెడికల్ ఆక్సిజన్ సిలిండర్లు మరియు దేశవ్యాప్తంగా వేగంగా పంపిణీ చేయడానికి అవసరమైన వాటిని తీసుకువెళ్తున్న భారత వైమానిక దళం (ఐఎఎఫ్) విమాన కదలికలకు విమానాశ్రయం అన్ని విధాలా సహకరిస్తోంది. 1 మే, 2021 నుండి ఐఎఎఫ్ 900 ఆక్సిజన్ సిలిండర్లను మరియు సింగపూర్ నుండి 256 ఆక్సిజన్ సిలిండర్లను తీసుకువచ్చింది. ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు కూడా దేశానికి తీసుకురాబడ్డాయి. గత వారం కూడా చెన్నై విమానాశ్రయం నుండి ఐఎఎఫ్ విమానం లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకర్‌ను ఎయిర్ లిఫ్ట్ చేసింది. ఇవి అన్నీ కూడా కోవిడ్ ప్రోటోకాల్‌లకు కట్టుబడి ఉన్నాయి.చెన్నై విమానాశ్రయం ఏఏఐ మరియు ఇతర వాటాదారుల కోసం కోవిడ్ టీకా శిబిరాన్ని నిర్వహించింది మరియు సుమారు 2000 మంది ఫ్రంట్‌లైన్ కార్మికులకు టీకాలు వేశారు. మార్చి 2020 లో కోవిడ్ -19 మొదటి వేవ్ కారణంగా దేశవ్యాప్తంగా మొట్టమొదటి లాక్‌డౌన్ ప్రకటించినప్పుడు చెన్నై విమానాశ్రయంలో కార్గో ఉద్యమం కొనసాగింది. ఒక సంవత్సరం తరువాత మన దేశం మరొక ప్రమాదకరమైన దశ అయిన రెండవ వేవ్ కొనసాగుతున్న నేపథ్యంలో చెన్నై విమానాశ్రయం కోవిడ్ 19 కి వ్యతిరేకంగా భారతదేశం చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వడానికి అడుగులు వేస్తోంది.

# మహమ్మారి నడుమ గ్రామీణాభివృద్ధిలో భారత్ కొత్త మైలురాళ్లు

హైదరాబాద్ , మే 18: కోవిడ్ మహమ్మారి రెండోదశ విజృంభణతో గ్రామీణ భారతంపై తీవ్ర ప్రభావం పడినప్పటికీ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ దేశవ్యాప్తంగా అభివృద్ధి పనులు కుంటుపడకుండా ఎంతో కృషి చేసింది. ఈ మేరకు దేశమంతటా మంత్రిత్వశాఖ పరిధిలోని వివిధ పథకాల్లో వేగం, ప్రగతి నమోదు కావడం విశేషం. అభివృద్ధి పనులతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కోవిడ్-19 పరిస్థితి నిర్వహణకు రాష్ట్ర, జిల్లా, సమితుల స్థాయిలో నోడల్ వ్యక్తులకు శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించింది.

మహమ్మారి పరిస్థితుల్లోనూ 2021 మే నెలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ రెగా) కింద 1.85 కోట్ల మందికి ఉపాధి కల్పించబడింది. ఇది 2019 మే నెలలో ఇదే వ్యవధితో పోలిస్తే 52 శాతం అధికంగా రోజుకు రూ.1.22 కోట్ల మందికి ఉపాధి లభించింది.

ప్రస్తుత 2021 మే 13వ తేదీనాటికి 2021-22 ఆర్థిక సంవత్సరంలో తలసరి 34.56 రోజువారీ పనిదినాల వంతున 2.95 కోట్ల మందికి ఉపాధి కల్పించగా 5.98 లక్షల ఆస్తుల సృష్టి పూర్తయింది. ఇక ముందువరుసలోని ఉద్యోగులుసహా అన్ని స్థాయుల సిబ్బందిలో కొందరు మరణించగా, మరికొందరు వ్యాధిబారిన పడినా మంత్రిత్వశాఖ ఈ విజయం సాధించడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో కోవిడ్-19పై పోరాడేందుకు మహమ్మారి అనుగుణ ప్రవర్తన, టీకాలు వేయడంపై 'దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం' (డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం) కింద 2021 ఏప్రిల్ 8-12 తేదీల మధ్య శిక్షకులకు శిక్షణ ఇవ్వబడింది. అంతేకాకుండా టీకాలపై విముఖత తొలగింపు, ఆరోగ్యకర అలవాట్ల అనుసరణ, రోగనిరోధకత పెంపు చర్యలు తదితరాలపై ప్రజలను ప్రోత్సహించడంపైనా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా, సమితుల స్థాయిన 34 'ఎస్ఆర్ఎల్ఎం'లలో మొత్తం 13,598 మంది ప్రధాన శిక్షకులు శిక్షణ పొందారు. వీరిద్వారా 1,14,500 మంది 'సామాజిక రిసోర్స్ పర్సన్లు' (సీఆర్‌పీ) శిక్షణ పొందగా, ఈ 'సీఆర్‌పీ'లు 2.5 కోట్ల మంది స్వయం సహాయ సంఘాల మహిళలకు శిక్షణ ఇచ్చారు. మరోవైపు రాష్ట్ర, జిల్లా నోడల్ వ్యక్తులకు 'డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం' కింద కోవిడ్ నిర్వహణపై సామర్థ్య వికాసం, సామాజిక అభివృద్ధి సంబంధిత శిక్షణ కూడా ఇచ్చారు.

ఉపశమనం, ఉపాధి సృష్టి లక్ష్యంగా ఆవృత (రివాల్వింగ్) నిధి, సామాజిక పెట్టుబడుల నిధి (సీఐఎఫ్) కింద 2021 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయ సంఘాలకు రూ.56 కోట్లదాకా విడుదల చేయబడ్డాయి. అంతకుముందు 2020 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇదే వ్యవధిలో ఇది దాదాపు రూ.32 కోట్లు అధికం. మరోవైపు వ్యవసాయ, వ్యవసాయేతర జీవనోపాధిపై సిబ్బందికి, సామాజిక కార్యకర్తలకు ఆన్‌లైన్ శిక్షణ కొనసాగుతోంది. అంతేగాక స్వయం సహాయ సంఘాల కుటుంబాల ద్వారా వ్యవసాయ-పోషకాహార తోటల పెంపకం ప్రోత్సహించబడింది.

# తౌక్టే తుఫాను సన్నద్ధతను కొనసాగిస్తున్న ఐఏఎఫ్



హైదరాబాద్ , మే 18: తౌక్టే బీకర తుఫానును ఎదుర్కొనే దిశగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) తన సన్నద్ధతను కొనసాగిస్తోంది. తౌక్టే తుఫాను సన్నద్ధతలో భాగంగా 16 మే 2021 (ఆదివారం) ఐఏఎఫ్ 167 మంది సిబ్బందిని రవాణా చేయడానికి 2 సీ -130 జే మరియు 1 ఏఎన్-32 విమానాల్ని రంగంలోకి దింపింది. ఈ విమానాల్ని కోల్‌కతా నుండి అహ్మదాబాద్‌కు 16.5 టన్నుల మేర ఎన్‌డీఆర్ఎఫ్ సామగ్రిని రవాణాకు ఉపయోగించారు. ఏఎన్ -32 ప్రస్తుతానికి అహ్మదాబాద్ వెళ్లే మార్గంలో ఉంది.

మరో సీ-130 జే, 2 ఏఎన్-32 విమానాలు 121 ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని, 11.6 టన్నుల లోడ్‌ను తీసుకొని ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుంచి అహ్మదాబాద్‌కు పయనమయ్యాయి. దీనికి తోడుగా 2 సీ -130 జే విమానం దాదాపు 110 మంది ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని, 15 టన్నుల సరుకును పూణె నుంచి అహ్మదాబాద్‌కు రవాణా చేసింది.

# విద్యార్థుల భద్రత, సంక్షేమమే ధ్యేయం

**-కేంద్రమంత్రి పోఖ్రియాల్ స్పష్టీకరణ**

**రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల విద్యా కార్యదర్శుల భేటీకి అధ్యక్షత**

**కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో పాఠశాల విద్యపై ఇదే అతిపెద్ద సమావేశం**

**సమగ్ర శిక్షా కార్యక్రమం కింద రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు అడ్ హాక్ గ్రాంటుగా రూ. 5,228కోట్ల విడుదల**

**విద్యా కార్యక్రమాల కొనసాగింపునకు త్వరలోనే అదనంగా రూ. 2,500కోట్లు**

**పాఠశాల విద్యపై రాష్ట్రాల కృషికి అభినందన,.**

**పూర్తి మద్దతు ఇచ్చేందుకు కేంద్రం హామీ**

హైదరాబాద్ , మే 18: దేశంలో కోవిడ్ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో విద్యా వ్యవస్థ నిర్వహణకు తీసుకున్న చర్యలు, స్కూళ్లలో ఆన్ లైన్, ఆఫ్ లైన్ పద్ధతుల్లో విద్యాభ్యాసం కోసం ఇప్పటివరకూ అనుసరించిన వ్యూహాలు, ఇక ముందు తీసుకోవలసిన చర్యలపై చర్చించేందుకు నిర్వహించిన సమావేశానికి కేంద్ర విద్యా శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ 'నిశాంక్' వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా అధ్యక్షత వహించారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విద్యాశాఖల కార్యదర్శులతో ఈ సమావేశం జరిగింది. కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సంజయ్ ధోత్రే, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి అమిత్ ఖరే, పాఠశాల విద్య, అక్షరాస్యతా శాఖ కార్యదర్శి అనితా కర్వాల్, మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దాదాపు అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన విద్యాశాఖల ప్రతినిధులు సమావేశంలో పాలుపంచుకున్నారు. విద్యాశాఖకు చెందిన అదనపు ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ కార్యదర్శులు, ఆయా రాష్ట్రాల ప్రాజెక్టు డైరెక్టర్లు, విద్యా పరిశోధనా శిక్షణా మండలుల డైరెక్టర్లు తదితర అధికారులు కూడా పాల్గొన్నారు. కోవిడ్ వైరస్ మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో పాఠశాల విద్యపై జరిగిన అతిపెద్ద సమావేశంగా దీన్ని పరిగణించవచ్చు.

ఈ సమావేశంలో కేంద్రమంత్రి రమేశ్ పోఖ్రియాల్ ప్రసంగిస్తూ, దేశంలో ప్రస్తుతం కోవిడ్-19 సంక్షోభం నెలకొనడం దురదృష్టకరమని, అయితే, సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకే విద్యార్థుల భద్రత, విద్యాపరమైన సంక్షేమం లక్ష్యంగా అనేక ప్రయోగాలు చేపడుతోందని చెప్పారు.

కరోనా వ్యాప్తి నేపథ్యంలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు గత ఏడాదిలో తీసుకున్న సందర్భోచిత చర్యలను కొనసాగించాల్సి ఉందని కేంద్రమంత్రి పోఖ్రియాల్ చెప్పారు.

ఈ సంక్షోభ సమయంలో విద్యాపరంగా నష్టపోయేందుకు ఎక్కువ ఆస్కారం ఉన్న విద్యార్థుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం ముఖ్యమని చెప్పారు. వైరస్ వ్యాప్తి కొనసాగుతున్నా, 2020-21వ సంవత్సరంలో విద్యాభ్యాసం కొనసాగేలా విద్యా శాఖ పలు చర్యలు తీసుకుందన్నారు. పి.ఎం. ఈ విద్య (ఖఓ వఎఆఆజం) కార్యక్రమం కింద దీక్షా పోర్టల్ విస్తృతం చేయడం, స్వయంప్రభ టీవీ ఛానల్స్ పరిధిలోకి డి.టి.హెచ్. ఛానల్స్ తీసుకురావడం, ఉపాధ్యాయులకు దీక్షా పోర్టల్ ద్వారా ఆన్ లైన్ లో నిష్ఠా శిక్షణను కల్పించడం, విద్యార్థుల మనస్తత్వానికి తగినట్టుగా సామాజిక భావోద్వేగ అవసరాలకు తగిన మనోదర్పణ కార్యక్రమం ప్రారంభించడం తదితర చర్యలను తీసుకున్నట్టు పోఖ్రియాల్ చెప్పారు. డిజిటల్ విద్యకు అనుసంధానం కాకుండా దూరంగా ఉంటున్న చిన్నారుల ప్రయోజనాల కోసం అనేక చర్యలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు. 2020వ సంవత్సరపు జాతీయ విద్యా విధానాన్ని పటిష్టంగా అమలు చేయడంలో వివిధ భాగస్వామ్య వర్గాలకు ప్రమేయం కల్పించేందుకు చర్యలు తీసుకోవడం ముఖ్యమని ఆయన చెప్పారు.

ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలు ప్రస్తావించిన సమస్యలను, చేసిన సూచనలను పోఖ్రియాల్ రికార్డు చేసుకున్నారు. పిల్లల విద్యాపరమైన సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ చేసిన కృషిని రాష్ట్రాలు కూడా అభినందించాయి. విద్యారంగంలో ఆయా రాష్ట్రాలు చేసిన కృషి అభినందనీయమని కేంద్రమంత్రి కూడా అన్నారు. ప్రస్తుత కష్ట సమయంలో పూర్తి స్థాయిలో మద్దతు అందించేందుకు తమ మంత్రిత్వ శాఖ సంసిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. కలసికట్టుగా సమస్యలను పరిష్కరించగలమని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సంజయ్ ధోత్రే మాట్లాడుతూ, కోవిడ్ మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో ఎదురైన సవాళ్లను పరిష్కరించేందుకు భారతీయ విద్యా వ్యవస్థలో భాగంగా ప్రభుత్వం నూతనమైన సృజనాత్మక చర్యలు తీసుకుందని చెప్పారు. విద్యా వ్యవస్థలో ఆన్ లైన్, ఆఫ్ లైన్ బోధనా పద్ధతులను పాటించేందుకు తీసుకోవలసిన చర్యలను అన్వేషించాలని ఆయన సూచించారు. ఇందుకోసం మనకు కొత్త అభ్యాస పద్ధతులు, నాణ్యమైన పాఠ్యాంశాలు, మదింపు నమూనాలు అవసరమని ఆయన అన్నారు. కోవిడ్ అనంతర ప్రపంచంలో విద్యార్థుల శాస్త్రీయ అవగాహన వంటివి నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశం ఉందని, అందువల్ల విద్యార్థుల్లో పరిశీలనాత్మక ఆలోచనా దృక్పథం, తార్కిక చింతనా సామర్థ్యం, శాస్త్రీయ అవగాహన వంటి అంశాలే లక్ష్యంగా మన విద్యా వ్యవస్థ పనిచేయాలని అన్నారు. 2020వ సంవత్సరపు జాతీయ విద్యావిధానం స్ఫూర్తిని మరింత పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పనిచేయాలని, ఆశించిన లక్ష్యాలను సాధించేందుకు ఈ విద్యావిధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. కోవిడ్ సంక్షోభం నేపథ్యంలో ఒక సమగ్రమైన ప్రతిస్పందనా పత్రాన్ని విద్యా శాఖ ఈ నెల 4వ తేదీన జారీ చేసిందని మంత్రి చెప్పారు.

కొత్త విధానంలో భాగంగా గుర్తించిన అంశాలు: బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి వారిని విద్యాస్రవంతిలో చేర్చడం, వారి పేర్లు స్కూళ్లలో నమోదయ్యేలా తగిన చర్యలు తీసుకోవడం, విద్యాభ్యాసం, విద్యార్థుల మేధో వికాసం, సామర్థ్యాలకు పదను పెట్టడం, ప్రత్యేక దృష్టితో ఇంటిలోనే విద్యాభ్యాసం, విద్యార్థుల సామర్థ్యాల మదింపు, సమాచార వినియోగం, పౌష్టికాహార, భావోద్వేగ మద్దతు, డిజిటల్ విద్య, పర్యవేక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం.

దీనికి తోడు, ప్రస్తుతం మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో ఈ కింద పేర్కొన్న సమగ్ర శిక్షా కార్యక్రమ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.:

విద్యార్థులకు అనుబంధ అంశాలను నేర్పించేందుకు అభ్యాసం పెంపుదల/విస్తరణ కార్యక్రమం.

చదువుకునే పుస్తకాలు, తగిన అభ్యాస సామగ్రిని విద్యార్థులకు అందుబాటులో ఉంచేందుకు గ్రంథాలయం మంజూరు.బడికి దూరమైన విద్యార్థులకు, ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం.

16నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి, బడికి దూరమైన విద్యార్థులకు జాతీయ సార్వత్రిక పాఠశాల విద్యా సంస్థ (ఎన్.ఐ.ఒ.ఎస్.), రాష్ట్ర స్థాయి ఓపెన్ స్కూళ్ళ ద్వారా తగిన మద్దతు అందించడం.విద్యార్థులకోసం సామాజిక భాగస్వామ్యం, తల్లిదండ్రుల మద్దతు కోసం స్కూల్ మేనేజిమెంట్ కమిటీ శిక్షణను వినియోగించుకోవడం.

చిన్న పిల్లల సంరక్షణ, విద్యాభ్యాసం, ప్రాథమిక స్థాయిలోనే అభ్యాస సామగ్రిని కల్పించడం. పంచాయతీల స్థాయిలో సహాయ కేంద్రం (హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేయడం, సామాజిక ప్రచార సాధనాల వినియోగం ద్వారా విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించడం

విద్యార్థుల జాబితా తయారీ కోసం చైల్డ్ ట్రాకింగ్ నిధులను వినియోగించే అవకాశం.

## టౌక్టే తుపానును ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకున్న రైల్వే శాఖ

హైదరాబాద్ , మే 18: టౌక్టే తుపానును ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. అవి:

1. జోనల్, డివిజన్ నియంత్రణ విభాగాలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. దక్షిణ రైల్వే, నైరుతి రైల్వే, కొంకణ్ రైల్వే, మధ్య రైల్వే, పశ్చిమ రైల్వే పరిధుల్లోని స్టేషన్లతో నిరంతరం మాట్లాడుతున్నాయి. అత్యవసర పరిస్థితి ఎదురైతే పర్యవేక్షించడానికి, ప్రణాళిక సిద్ధం చేయడానికి డివిజన్, జోన్ రైల్వే విభాగాలు రాష్ట్ర ప్రభుత్వాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నాయి.
2. అత్యవసర సమాయాల్లో తక్షణం రంగంలోకి దిగేందుకు ప్రమాద సహాయక రైళ్లు (ఏఆర్‌టీ), వైద్య సహాయక వాహనాలు (ఎంఆర్‌వీ), టవర్ వ్యాగన్ల వంటి అత్యవసర విభాగాలను అప్రమత్తం చేశారు.
3. రుతుపవన సమయాల తరహాలో ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.
4. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గాలి వేగాన్ని పర్యవేక్షిస్తూ, నిబంధనల ప్రకారం రైళ్ల వేగాన్ని తగ్గించారు.
5. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రయాణీకుల రైళ్ల తాత్కాలిక రుద్దు లేదా ముందస్తు రద్దు నిర్ణయం తీసుకుంటారు.
6. ఈ నెల 14వ తేదీన సాయంత్రం 4 గం. నుంచి ఒక విపత్తుల నిర్వహణ విభాగం పని చేస్తోంది.
7. గోవా పోర్టు, వీఎస్‌జీ సహా ఇతర స్టేషన్లకు సేవలు అందించే రైల్వే మార్గాలకు తగిన హెచ్చరికలు పంపుతున్నారు. తుపాను తీవ్రత ఎక్కువగా ఉంటే రైళ్లను నిలిపేస్తారు. ప్రస్తుతం చాలా తక్కువ రైళ్లు నడుస్తున్నాయి.
8. నౌకాశ్రయాల వద్ద రైళ్లలోకి సరకులు ఎక్కించడం, దించడం వంటివి నిలిపేశారు. తుపాను పరిస్థితులను బట్టి ఆయా పనులను సర్దుబాటు చేసుకోవాలని సంబంధిత వర్గాలకు సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా చూసుకోవాలని చెప్పారు.
9. తుపాను ప్రభావిత ప్రాంతాలు, ముఖ్యమైన వంతెనలను ఇంజినీర్ల విభాగాలు అనుక్షణం పర్యవేక్షిస్తున్నాయి. సహాయక బృందాలు త్వరగా రంగంలోకి దిగడానికి వీలుగా అనువైన ప్రాంతాల్లో సహాయక సామగ్రిని నిల్వ చేశారు.
10. రాష్ట్రాల వాతావరణ విభాగాలతో రైల్వే శాఖ ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ, తదనుగుణంగా చర్యలు తీసుకుంటోంది.

ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు విపత్తు నిర్వహణ మార్గదర్శకాలను భద్రత విభాగం జారీ చేసింది. రైల్వే కార్యకలాపాల్లో అంతరాయ సమయాన్ని తగ్గించేందుకు, భద్రత కారణాలతో తాత్కాలికంగా సేవల రద్దు జరిగినచోట్ల త్వరగా ప్రారంభమయ్యేలా చూసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## తిరుపతిలో 12 అడుగుల కొండచిలువ హల్ చల్



తిరుపతి,మే 18: తిరుపతి లోని జీవకోన లోని లింగేశ్వర స్వామి ఆలయం వద్ద భారీ కొండచిలువ హల్ చల్ చేసింది. స్థానిక జీవకోన వద్ద నున్న లింగేశ్వర్ గుడి ప్రాంతం వద్ద 12 అడుగుల కొండచిలువ కుక్క పిల్లను మింగి తచ్చాడుతూ ఉంది. అది గమనించిన భక్తులు భయాందోళనకు గురైనారు. దీంతో భాస్కర్ నాయుడు వచ్చి చాక చక్యంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

## రాజకీయాల్లో నూతన ఒరవడి.. తమిళనాడులో కరోనా కట్టడి కోసం కమిటీ ఏర్పాటు

హైదరాబాద్ , మే 18: తమిళనాడులో కరోనా వైరస్ తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఈ నేపథ్యంలో కరోనాపై పోరులో భాగంగా స్టాలిన్ రాజకీయ ఒరవడికి నాంది పలికారు. ఈ మేరకు 13 మందితో ఓ టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఏకంగా 12 మంది ప్రతిపక్ష పార్టీల నేతలకు స్టాలిన్ స్థానం కల్పించారు. ఈ కమిటీకి స్టాలిన్ అధ్యక్షుడిగా ఉన్నారు. కరోనాను కట్టడి చేసేందుకు ఈ కమిటీ సమీక్షలు జరుపుతూ, ప్రభుత్వానికి అవసరమైన సూచనలు, సలహాలను అందిస్తుంది.

ఈ కమిటీలో ఉన్న సభ్యులు: డాక్టర్ ఎజిలన్ (డీఎంకే), డాక్టర్ విజయభాస్కర్ (ఏఐఏడీఎంకే), జీకే మణి (పీఎంకే), ఎస్ఎస్ బాలాజీ (వీసీకే), టీ రామచంద్రన్ (సీపీఐ), నాగై మాలి (సీపీఎం), డాక్టర్ జవహరుల్లా (ఎంఎంకే), ఏఎం మణిరత్నం (కాంగ్రెస్), నగర్ నాగేంద్రన్ (బీజేపీ), సుశాన్ తిరుమలై కుమార్ (ఎండీఎంకే), ఆర్ ఈశ్వరన్ (కేఎండీకే), టి.వేల్మురుగన్ (టీవీకే), పూవై జగన్ మూర్తి (పీబీ). కాగా స్టాలిన్ తీసుకున్న నిర్ణయంపై తమిళనాడు ప్రజలు, రాజకీయ విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సోనూసూద్ ను చూసి తెలుగు హీరోలు కళ్లు తెరవాలి-భట్టి విక్రమార్క



హైదరాబాద్ , మే 18: కరోనా కష్ట సమయంలో ఎంతోమంది పేద ప్రజలకు సహాయం చేసి రియల్ హీరో అనిపించుకున్నాడు బాలీవుడ్ నటుడు సోను సూద్. లాక్ డౌన్ సమయంలో స్వగ్రామాలకు ఎంతో మంది పేద ప్రజలకు తరలించి వారి మన మనసులు గెలుచుకున్నాడు. సహాయం అని అడిగిన ప్రతి ఒక్కరికి తన వంతు సహాయం చేసి వారి అందరి అభిమానాన్ని పొందాడు.

ఇక కరోనా సెకండ్ వేవ్ సమయంలో కూడా ఎంతో మందికి ఇంజెక్షన్లను ,బెడ్స్ ను ఏర్పాటు చేస్తున్నాడు. అయితే సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సోనూసూద్ పై ప్రశంసల జల్లు కురిపించారు. సోనూసూద్ ను చూసి తెలుగు హీరోలు హీరోయిన్లు కళ్లు తెరవాలని భట్టి విక్రమార్క అన్నారు. కరోనా బాధితులకు టాలీవుడ్ హీరోలు హీరోయిన్ ముందుకు వచ్చి సహాయం చేయాలన్నారు.

# పప్పుధాన్యాల నిల్వలను ప్రకటించమని స్టాక్ హోల్డర్స్ మిల్లర్లు, వ్యాపారులు, దిగుమతిదారులు మొదలైనవారిని ఆదేశించాలని రాష్ట్రాలు / యుటిలను కేంద్రం ఆదేశం

హైదరాబాద్ , మే 18: మిల్లర్లు, దిగుమతిదారులు, వ్యాపారులు వంటి స్టాక్ హోల్డర్లు పప్పుధాన్యాల నిల్వను బహిర్గతం చేయడానికి రాష్ట్రాలు / యుటిలు తీసుకున్న చర్యను వినియోగదారుల వ్యవహారాల విభాగం ఈ రోజు సమీక్షించింది. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా సమావేశం ఈ రోజు ఆహార, పౌర సరఫరా మరియు ప్రధాన శాఖ కార్యదర్శులతో జరిగింది. ఇందులో రాష్ట్రాలు / యుటిల వినియోగదారుల వ్యవహారాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీమతి లీనా నందన్, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆహార మరియు ప్రజా పంపిణీ దేశవ్యాప్తంగా పప్పుధాన్యాల లభ్యత మరియు ధరల పరిస్థితిని సమీక్షించారు. ఈ సమావేశంలో భారత ప్రభుత్వ ఆహార, ప్రజా పంపిణీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ కార్యదర్శి పాల్గొన్నారు.

సమావేశంలో ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ (ఇసి యాక్ట్), 1955 సాధారణ ప్రజలకు సరసమైన ధరలకు షెడ్యూల్ చేయబడిన నిత్యావసర వస్తువుల తగినంత లభ్యతను నిర్ధారించడం లక్ష్యంగా ఉందని పునరుద్ఘాటించారు. స్టాక్ హోల్డర్స్ పప్పుధ్యాన్యాల అక్రమ నిల్వల కారణంగా ధరలు పెరుగుతాయని సమావేశంలో గమనించారు.

ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ (ఇసి యాక్ట్), 1955 లోని సెక్షన్ 3 (2) (హెచ్) మరియు 3 (2) (ఐ) ప్రకారం ఉత్పత్తి, సరఫరా లేదా నిమగ్నమై ఉన్న వ్యక్తులకు సమాచారం లేదా గణాంకాలను సేకరించడానికి ఇష్యూ ఆర్డర్లు జారీ చేయడానికి అధికారం ఉంది. ఏదైనా ముఖ్యమైన వస్తువు యొక్క పంపిణీ లేదా వాణిజ్యం మరియు వ్యాపారానికి సంబంధించిన పుస్తకాలు, ఖాతాలు మరియు రికార్డులను పరిశీలించడానికి మరియు వాటికి సంబంధించిన సమాచారాన్ని అందించడానికి మరియు ఉత్పత్తి చేయడానికి అధికారం ఉంది.

ఈ విభాగం కింద ఉన్న అధికారాలను 09.06.1978 నాటి సెంట్రల్ ఆర్డర్ జీఎస్ఆర్ 800 ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించారు.

దీని ప్రకారం, 2021 మే 14 వ తేదీన వినియోగదారుల వ్యవహారాల శాఖ లేఖ, ఈసి చట్టం, 1955 లోని సెక్షన్ 3 (2) (హెచ్) మరియు 3 (2) (ఐ) కింద అధికారాన్ని ఉపయోగించాలని మరియు అన్ని స్టాక్ హోల్డర్లను ఆదేశించాలని రాష్ట్రాలు / యుటిలను అభ్యర్థించింది. పప్పుధాన్యాల నిల్వలను ప్రకటించడానికి మిల్లర్లు, వ్యాపారులు, దిగుమతిదారులు మొదలైనవాటిని మరియు రాష్ట్ర / యుటి ప్రభుత్వాలు దీనిని ధృవీకరించవచ్చు.

పప్పుధాన్యాల ధరలను వారానికొకసారి పర్యవేక్షించాలని రాష్ట్రాలు / యుటిలు కూడా అభ్యర్థించబడ్డాయి. మిల్లర్లు, టోకు వ్యాపారులు, దిగుమతిదారులు మొదలైన వారి వివరాలను మరియు వారి వద్ద ఉన్న పప్పుధాన్యాల నిల్వలను నింపడానికి ఆన్‌లైన్ డేటాషీట్ రాష్ట్రాలు / యుటిలతో భాగస్వామ్యం చేయబడింది.

పప్పుధాన్యాలు ఉత్పత్తి చేసే రాష్ట్రాలు / యుటిలు కూడా సేకరణను సులభతరం చేయాలని అభ్యర్థించబడ్డాయి. ఎందుకంటే నిరంతర సేకరణ రైతులు దీర్ఘకాలిక ప్రాతిపదికన పప్పుధాన్యాలను పండించడానికి ప్రోత్సహిస్తుంది. పప్పుధాన్యాల బఫర్‌ను వినియోగదారుల వ్యవహారాల శాఖ ధరల స్థిరీకరణ నిధి (పిఎస్ఎఫ్) కింద రైతుల నుంచి సేకరించిన పప్పుధాన్యాలతో నిర్వహిస్తుంది.

బఫర్ సేకరణ ప్రక్రియ ఒకవైపు రైతులకు ఎంఎస్‌పి వద్ద పప్పుధాన్యాలు సేకరించడం ద్వారా మద్దతు ఇస్తుంది. అయితే బఫర్ నుండి సరుకుల సరఫరా మితమైన ధరల అస్థిరతను నియంత్రించడంలో సహాయపడుతుంది. తద్వారా వినియోగదారులకు కష్టాలను తగ్గించవచ్చు. తక్కువ లాజిస్టిక్ ఖర్చులతో రాష్ట్రాలకు నిల్వలను సరఫరా చేసేందుకు మరియు వాటిని వినియోగదారులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచడానికి సేకరించిన పప్పుధాన్యాలు స్థానికంగా నిల్వ చేయబడుతున్నాయి.

మొత్తం 22 ముఖ్యమైన వస్తువుల ధరలను, ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు మరియు పాలను పర్యవేక్షించాలని మరియు ఏదైనా అసాధారణమైన ధరల పెరుగుదలకు ముందస్తు సంకేతాలను చూడాలని రాష్ట్రాలు / యుటిలను అభ్యర్థించారు. తద్వారా ఈ ఆహార పదార్థాలు వినియోగదారులకు సరసమైన ధరలకు అందించబడుతున్నాయని నిర్ధారించడానికి సకాలంలో జోక్యం చేసుకోవచ్చు.

కంది / కందికాయల దిగుమతి విధానం సవరణకు సంబంధించి వాణిజ్య శాఖ జారీ చేసిన 2021 మే 15 నాటి నోటిఫికేషన్ గురించి రాష్ట్రాలు / యుటిలు కూడా తెలియజేయబడ్డాయి; తద్వారా పెసర మరియు మినప "పరిమితం" నుండి "ఉచిత" వరకు తక్షణ ప్రభావంతో మరియు 31 వ అక్టోబర్ 2021 వరకు అమలులో ఉంటుంది.

ఈ సరళీకృత విధానం పప్పుధాన్యాలను సజావుగా మరియు సకాలంలో దిగుమతి చేసుకోగలదు. ఫైటో–శానిటరీ క్లియరెన్స్‌లు మరియు కస్టమ్స్ క్లియరెన్స్‌ల వంటి అన్ని రెగ్యులేటరీ క్లియరెన్స్‌లు సకాలంలో జారీ చేయబడతాయి. ఈ రోజు జరిగిన ఆహార, వినియోగదారుల వ్యవహారాలు, వ్యవసాయం, కస్టమ్స్ మరియు వాణిజ్య విభాగాల సమావేశంలో ఈ విషయాలు చర్చించబడ్డాయి.

# తుపాను టౌక్టే: భారతీయ పశ్చిమ తీరం వెంట బహుళ అన్వేషణ, సహాయక మిషన్లను నిర్వహిస్తున్న భారతీయ నావికా దళం

హైదరాబాద్ , మే 18: అరేబియా సముద్రంలో కర్నాటకలోని మంగళూరుకు వాయువ్య దిశలో చిక్కుకున్న భారతీయ నౌక కోరమాండల్ సపోర్టర్ ఎచీ లోని సిబ్బంది తమను కాపాడమంటూ ఇచ్చిన ఎన్ఓఎస్‌కు తక్షణమే స్పందించి, రక్షించేందుకు నావికాదళ హెలికాప్టర్‌ను మే 17వ తేదీ తెల్లవారుజామున పంపారు. తుపాను టోక్టే కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో నౌక యంత్ర సామాగ్రి ఉన్న కంపార్ట్‌మెంటులోకి వరదలా నీరు ప్రవేశించి, చోదనం, విద్యుత్ సరఫరాను ఆటంకపరిచాయి, సిబ్బంది కూడా ఎటువంటి మద్దతు లేకపోవడంతో నౌకలోనే మిగిలిపోయారు. పడవల ద్వారా వారిని కాపాడే ప్రయత్నాలు అనేకసార్లు విఫలం కావడంతో భారతీయ నావికా దళ హెలోను 17 మే 21 తెల్లవారుజమున పంపారు. నలుగురు సిబ్బందిని హెలో సురక్షితంగా పైకి లాగగలిగారు.సుమారు 273మంది సిబ్బందితో బాంబే హై ప్రాంతంలోని హీరా చమురు క్షేత్రం నుంచి కొట్టుకుపోయిన బార్జ్ పి 305 నుంచి సహాయం కోసం విజ్ఞప్తి అందుకున్న తర్వాత, పరిస్థితిని అంచనా వేసి, తగిన సహాయాన్ని అందించేందుకు ఐఎన్ఎస్ కొచ్చి తక్షణమే బయలుదేరి వెళ్లింది. ఐఎన్ఎస్ తల్వార్ కూడా బయలుదేరి వెళ్లేందుకు సిద్ధం అవుతోంది. దాదాపు 137మంది వ్యక్తులతో ముంబైకి 8 నాటికల్ మైళ్ళ దూరంలో కొట్టుకుపోతున్న బార్జ్ జీఏఎల్ కన్‌స్ట్రక్టర్ నుంచి వచ్చిన ఎస్ఓఎస్ కు స్పందనగా, ఐఎన్ఎస్ కోల్‌కతా కూడా సాయాన్ని అందించేందుకు బయలుదేరింది.

టౌక్టే తుఫానును ఎదుర్కొనేందుకు ఏర్పాట్లను కొనసాగిస్తూ, రాష్ట్ర అధికారుల నుంచి ఎటువంటి విజ్ఞప్తి వచ్చినా, వెంటనే మోహరించేందుకు 11 భారతీయ నావికాదళ డైవింగ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. వీరితో పాటుగా 12 వరద సహాయ బృందాలు, వైద్య బృందాలను కూడా తక్షణమే స్పందించి, మోహరించేందుకు కేటాయించారు. తుపాను అనంతరం అవసరమైతే తక్షణమే మౌలిక సదుపాయాల మరమ్మతుల నిమిత్తం మరమ్మతు, రక్షణ బృందాలను సృష్టించారు.

పశ్చిమ తీరంలో వివిధ నౌకలు దెబ్బతిన్న ప్రాంతాలలో అవసరమైనంత మేరకు తక్షణ తోడ్పాటు కోసం సహాయ సామాగ్రితో నిలిచి ఉన్నాయి. దీనితో పాటుగా అల్లకల్లోలంగా ఉన్న వాతావరణం కారణంగా సముద్రంలో చిక్కుకుపోయిన చిన్న ఫిషింగ్ బోట్లు/ చిన్న పడవలను కాపాడేందుకు వీరు ప్రయత్నిస్తారు.

నిఘాలో ఉన్న నావికాదళానికి చెందిన మారిటైమ్ రీకనె?నసానన్స్ విమానాలు మత్స్యకారులకు నిరంతరం తుపాను హెచ్చరికలను ప్రసారం చేస్తున్నాయి.

ఇంతకు ముందు తెలిపినట్టుగా, నావికాదళాలు సహాయక కార్యకలాపాలను కేరళలోని కొచ్చిలో కూడా చేపట్టారు. వరద కారణంగా చిక్కుకుపోయిన స్థానిక ప్రజలకు సహాయాన్ని అందించేందుకు దక్షిణ నావికాదళ కమాండ్‌కు చెందిన మూడు డైవింగ్ టీంలను, క్విక్ రియాక్షన్ టీమ్‌లను చెల్లానం (కొచ్చి) వద్ద మోహరించారు. భారీగాలు నీరు నిలిచిపోవడంతో ఇతర వాహనాలు ప్రయాణించలేని ప్రాంతంలోని సహాయక శిబిరాలకు ఈ బృందాలు ఆహారం, నీరు, నిత్యావసర వస్తువులనుచేరవేశాయి. ఇళ్లలో చిక్కుకు పోయిన ప్రజలను వారి ఇళ్ళనుంచి జెమినీ రబ్బర్ క్రాఫ్ట్‌లలో ఎర్నాకుళం, చెల్లానంలో ఎత్తైన ప్రదేశాలలో ఉన్న సహాయక శిబిరాలకు తీసుకువెళ్ళారు. నీరు నిలిచిపోయిన కారణంగా పూర్తిగా అందుబాటులో లేకుండా పోయిన చెల్లానంలోని కోర్టినా ఆసుపత్రికి మంచినీరు, ఇతర అత్యవసర వస్తువులను నావికాదళ బృందం చేరవేసింది.

# కొవిడ్ రెండో దశపై పోరాటంలో రక్షణ మంత్రిత్వ శాఖ, సాయుధ దళాలు, డీఆర్‌డీవో, ఇతర రక్షణ సంస్థల ప్రయత్నాలపై సమీక్షించిన రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్ , మే 18: కొవిడ్ రెండో దశపై పోరాటంలో రాష్ట్ర ప్రభుత్వాలకు సాయంగా రక్షణ మంత్రిత్వ శాఖ, త్రివిధ దళాలు, డీఆర్‌డీవో, ఇతర రక్షణ సంస్థలు చేస్తున్న ప్రయత్నాలపై రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్ష జరిగింది. 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్' జనరల్ బిపిన్ రావత్, రక్షణ శాఖ కార్యదర్శి డా.అజయ్ కుమార్, నౌకాదళాధిపతి అడ్మిరల్ కరంబీర్ సింగ్, వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్.కె.ఎస్. భదౌరియా, సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె, రక్షణ ఆర్‌డీ విభాగం కార్యదర్శి, డీఆర్‌డీవో ఛైర్మన్ డా.జి.సతీష్‌రెడ్డి, అదనపు కార్యదర్శి (రక్షణ ఉత్పత్తులు) సంజయ్ జాజు, సాయుధ బలగాల వైద్య సేవల (ఏఎఫ్‌ఎంఎస్) ఏడీజీ, మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

వివిధ రాష్ట్రాల్లో డీఆర్‌డీవో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కొవిడ్ ఆసుపత్రులు, సైనిక ఆసుపత్రుల్లో అదనపు పడకల ఏర్పాటు, పీఎం కేర్స్ నిధులతో 'ప్రెజర్ స్వింగ్ అడ్సర్ప్షన్' (పీఎస్ఏ) ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రస్తుత అవసరాలకు తగినట్లు వైద్యులు, ఆరోగ్య నిపుణుల సంఖ్య పెంపుపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. దిల్లీ, లఖ్‌నవూ, వారణాసి, అహ్మదాబాద్, పట్నాలో ఏర్పాటు చేసిన ఆసుపత్రులు కొవిడ్ రోగులకు సేవలు అందిస్తున్నాయని డీఆర్‌డీవో ఛైర్మన్ డా.సతీష్ రెడ్డి వివరించారు. ఉత్తరాఖండ్‌లోని రిషికేష్, హల్ద్వానీతోపాటు, జమ్ము, శ్రీనగర్‌లో ఆయా ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

దిల్లీలో నాలుగు, హరియాణాలో ఒక పీఎస్ఏ ఆక్సిజన్ ప్లాంటును డీఆర్‌డీవో ఏర్పాటు చేసిందని, ఈ నెలాఖరుకల్లా 150–175 ప్లాంట్ల ఏర్పాటుకు పనులు జరుగుతున్నట్లు డా.సతీష్ రెడ్డి తెలిపారు.

రవాణా మద్దతు, ఆరోగ్య అదనపు మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వాలకు సాయం అందించడంలో త్రివిధ దళాలు కనబరుస్తున్న అద్భుత సమన్వయాన్ని 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్' జనరల్ బిపిన్ రావత్ ప్రశంసించారు. స్థానిక ప్రభుత్వాలకు సాయంగా సుదూర, మారుమూల ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలను సైన్యం ఏర్పాటు చేసిందని చెప్పారు.

కొవిడ్‌పై పోరాటంలో ఏ ఒక్క అంశాన్నీ సైన్యం వదిలిపెట్టడం లేదని సైన్యాధిపతి ఎం.ఎం.నరవణె స్పష్టం చేశారు. గుర్తించిన ప్రదేశాల్లోని సైనిక ఆస్పత్రులు సాధారణ పౌరుల కొవిడ్ చికిత్స కోసం పడకలు కేటాయించాయని రక్షణ మంత్రికి వివరించారు. దిల్లీలోని బేస్ ఆసుపత్రిలోనూ సౌకర్యాలు పెరుగుతున్నాయన్నారు. ఈ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, ఆక్సిజన్ సరఫరాను పెంచడానికి అదనపు ఆక్సిజన్ ప్లాంట్లు, సిలిండర్లు, కాన్సన్‌ట్రేటర్లను సేకరిస్తున్నట్లు చెప్పారు.

వైద్య ఆక్సిజన్ కంటైనర్లు, ఇతర వైద్య పరికరాలను విదేశాల నుండి తీసుకురావడంలో నౌకాదళం అందిస్తున్న మద్దతు గురించి నౌకాదళాధిపతి అడ్మిరల్ కరంబీర్ సింగ్ రక్షణ మంత్రికి వివరించారు. పౌరులకు కొవిడ్ చికిత్స అందించేందుకు వివిధ ప్రదేశాల్లో నౌకాదళం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య సౌకర్యాలను గురించి కూడా ప్రస్తావించారు.

వివిధ మిషన్లలో భాగంగా ఆక్సిజన్ కంటైనర్లు, ఇతర వైద్య సామగ్రిని తీసుకొచ్చేందుకు వైమానిక దళం 990 ప్రయాణాలను పూర్తి చేసిందని వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్.కె.ఎస్. భదౌరియా రక్షణ మంత్రికి చెప్పారు.

త్రివిధ దళాలు అందించిన సాయాన్ని ప్రశంసించిన రక్షణ శాఖ కార్యదర్శి డా.అజయ్ కుమార్, ఆరోగ్య నిపుణుల కొరతను భర్తీ చేసేందుకు దాదాపు 800 మంది వైద్యులను నియమించినట్లు వెల్లడించారు.

హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో కలిసి లఖ్‌నవూ, బెంగళూరులో 250 పడకల ఆసుపత్రులను రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు) ఏర్పాటు చేశాయి. 'పారిశ్రామిక సామాజిక బాధ్యత' నిధులతో ఆక్సిజన్ ప్లాంట్లను కూడా పీఎస్‌యూలు ఏర్పాటు చేస్తున్నాయి.

కొవిడ్ రోగుల చికిత్స కోసం 2-డీజీ ఔషధాన్ని అభివృద్ధి చేయడానికి డీఆర్‌డీవో అందించిన సహకారాన్ని రక్షణ మంత్రి అభినందించారు. ప్రస్తుతం కరోనా కేసులు తగ్గుతున్నాయని, అయితే అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ, సాధారణ విధులను కొనసాగించాలని త్రివిధ దళాలు, రక్షణ మంత్రిత్వ శాఖ సంస్థలను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఆదేశించారు.

కొవిడ్ రెండో దశపై పోరాటంలో రక్షణ మంత్రిత్వ శాఖ, ఇతర రక్షణ సంస్థలు అందించిన సాయంపై రక్షణ మంత్రి నిర్వహించిన నాలుగో సమీక్ష ఇది. మొదటి మూడు సమీక్షలు ఏప్రిల్ 20, ఏప్రిల్ 24, మే 1వ తేదీన జరిగాయి.

# భారత వైమానిక దళం విమానంలో దుబయ్‌కి ఆక్సిజన్ కంటైనర్‌ల రవాణా

హైదరాబాద్ , మే 18: భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) చెందిన హెవీ లిఫ్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఫ్లీట్, ఖాళీ క్రయోజెనిక్ ఆక్సిజన్ ట్యాంకర్లను 20 ఏప్రిల్ 2021 నుండి భారతదేశంలోని ఆయా ఫిల్లింగ్ స్టేషన్లకు విమానంలో రవాణా చేస్తోంది. తద్వారా వాటిలో ప్రాణవాయువు నింపి రోడ్డు మార్గం లేదా రైలు ద్వారా గమ్యస్థానాలకు రవాణా చేసేందుకు వీలు కలుగుతుంది. ఐఏఎఫ్ ఇప్పుడు అంతర్జాతీయంగా వివిధ గమ్యస్థానాలకు కూడా ఇదే రకమైన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఐఏఎఫ్‌కు చెందిన ఐఎల్–76 విమానం జామ్‌నగర్ నుండి దుబయ్ దేశంలోని అల్ మక్తూమ్‌కు దాదాపు 03 ఖాళీ క్రయోజెనిక్ కంటైనర్లతో వాయుమార్గంలో పంపించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ కంటైనర్ల రవాణాను సమన్వయం చేస్తోంది. ఈ కంటైనర్‌లు దుబాయ్‌లోని లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్‌తో నింపబడుతాయి. ఓడ మార్గం ద్వారా తిరిగి భారతదేశానికి తీసుకురాబడతాయి. విమానాలలో కంటైనర్లను పంపించడం వల్ల ఖాళీ కంటైనర్ల రవాణా సమయం గణనీయంగా తగ్గుతుంది. వేగంగా ఆక్సిజన్ సరఫరాకు వీలుకలుగుతుంది.



## మత్స్యకార భరోసా నిధులు విడుదల చేసిన జగన్

హైదరాబాద్ , మే 18: సముద్రంలో చేపలవేట నిషేధ సమయంలో జీవనోపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిచ్చే 'వైఎస్ఆర్ మత్స్యకార భరోసా' పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది కూడా అమలుచేసింది. మంగళవారం నాడు సీఎం జగన్ తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా నగదు జమ చేశారు.

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడారు. కరోనా వేళ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని, అయిన? పేద ప్రజలు ఇబ్బందులు పడకూదన్న ఉద్దేశంతో తాము వారి సంక్షేమం కోసం అన్ని కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 1,19,875 మత్స్యకార కుటుంబాలకు దాదాపు రూ.120 కోట్లు జమ చేశామని తెలిపారు. మత్స్యకారులకు అండగా ఉంటామని ఇచ్చిన హామీని తాము నిలబెట్టుకుంటున్నామని జగన్ చెప్పారు. కరోనా పరిస్థితుల్లోనూ తాము ఏ మాత్రం వెనకడుగు వేయకుండా మత్స్యకార భరోసా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచే సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించామని పేర్కొన్నారు.

## ఈటెలకు ఆత్మగౌరవం ఉంటే రాజీనామా చేయాలి

కరీంనగర్ మే 18 (నేటినిజం ప్రతినిధి): మాజీ మంత్రి ఈటెల రాజేందర్ వ్యాఖ్యలకు మంత్రి గంగుల కమలాకర్ కౌంటర్ ఇచ్చారు. ఈటెలకు ఆత్మగౌరవం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలని సవాల్ విసిరారు. తానూ కూడా బీసీ బిడ్డనేనని స్పష్టం చేశారు. ఈటెల కంటే తనకే ఎక్కువ ఆత్మగౌరవం ఉందని, ఆయన బెదిరింపులకు భయపడేవాడు ఎవరూ లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్నాడు కాబట్టే ఈటెల ఇన్నాళ్లూ ఆ గౌరవమైనా దక్కిందన్నారు. అసైన్డ్ భూములు కొన్నట్టు స్వయంగా ఆయనే ఒప్పుకున్నారని గుర్తు చేశారు. అన్నింటినీ పరిశీలించిన తర్వాతే ఈటెలను సీఎం కేసీఆర్ బర్తరఫ్ చేశారన్నారు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత ఇప్పటివరకు ఈటెల తనతో మాట్లాడలేదన్నారు. వ్యక్తిగతంగా పోతే తానూ వ్యక్తిగతంగా పోవాల్సి వస్తుందని, దానిని ఈటెల తట్టుకోలేడని గంగుల హెచ్చరించారు.

1992 నుంచి చట్టబద్ధంగా తాము గ్రానైట్ వ్యాపారం చేస్తున్నామని గంగుల చెప్పారు. ఈటెల తరహాలో అసైన్డ్ భూములు కొని గోడౌన్లు కట్టి మద్యం షాపులకు ఇవ్వలేదన్నారు. హుజూరాబాద్‌లో ఇప్పటికీ క్వారీలు నడుస్తున్నాయని, దానిపై సీఎం కేసీఆర్‌కు ఎప్పుడూ ఎందుకు ఫిర్యాదు చేయలేదని మండిపడ్డారు. ఈటెలకు దమ్ముంటే అసైన్డ్ భూములను ప్రభుత్వానికి అప్పగించాలన్నారు. తాను పన్నులు ఎగ్గొట్టినట్టు నిరూపిస్తే దానికి ఐదింతలు కట్టేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. అధికారుల కమిటీ వేసి విచారణ చేయించేందుకు తాను సిద్ధమని, విచారణలో తప్పు చేశానని తేలితే దేనికైనా సిద్ధమని అన్నారు.

## అధికారం శాశ్వతం కాదని గుర్తుపెట్టుకోవాలి: ఈటెల

కరీంనగర్ మే 18:కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో మాజీ మంత్రి ఈటెల రాజేందర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్‌ను ఉద్దేశించి ఈటెల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు తనపై తోడేళ్లలా దాడులు చేస్తున్నవారు ఇక్కడ ఎవరి గెలుపులో అయినా సహకరించారా అంటూ సూటిగా ప్రశ్నించారు. మంత్రి హోదాలో ఉన్న వ్యక్తికి సభ్యత, సంస్కారం ఉండాలని హితవు పలికారు. హుజురాబాద్ ప్రజల ఆత్మగౌరవాన్ని ఎవరూ కొనలేరని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు.

తన ప్రాణం ఉన్నంతవరకు హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలను కాపాడుకుంటానని చెప్పారు. తనపై కక్షతో తనను కొందరు ఇబ్బంది పెట్టారని.. తన మద్దతుదారులు, ప్రజాప్రతినిధులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం తనకు పట్టిన గతే రేపు నీకు పట్టవచ్చంటూ నియోజకవర్గ ఇంఛార్జిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలన్నారు. 2023 తర్వాత నువ్వు ఉండవు.. నీ అధికారం కూడా ఉండదంటూ ఘాటు విమర్శలు చేశారు.

## ఏపీలో నేడు మరో పథకం.. ఒక్కొక్కరి ఖాతాల్లో రూ.10వేలు



అమరావతి, మే 18: ఏపీలో వైఎస్ఆర్ మత్స్యకార భరోసా పథకం కింద లబ్ధిదారులకు చెల్లించడానికి రూ.119.88 కోట్లను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. చేపల వేటను నిషేధించిన సమయంలో జీవనోపాధి కోల్పోయిన ఒక్కో మత్స్యకార కుటుంబానికి ఏటా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. మంగళవారం జరిగే కార్యక్రమంలో సీఎం జగన్ నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

గతంలో రూ.4 వేల చొప్పున మాత్రమే ఇచ్చిన భృతి మొత్తాన్ని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలకు పెంచింది. రెండేళ్లుగా ఏటా క్రమం తప్పకుండా వేట నిషేధ సమయంలోనే భృతిని అందజేస్తూ మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఈ విధంగా 2019లో 1,02,478 కుటుంబాలకు రూ.102.48 కోట్లు లబ్ధి చేకూర్చగా, 2020లో 1,09,231 కుటుంబాలకు రూ.109.23 కోట్ల మేర సాయమందించారు.

## రామగుండం ఎరువుల కర్మాగారంలో అమ్మోనియా గ్యాస్ లీక్..

హైదరాబాద్ , మే 18: తెలంగాణలోని రామగుండంలోనున్న ఎరువుల కర్మాగారంలో నిన్న తెల్లవారుజామున అమ్మోనియా గ్యాస్ లీకైంది. అరగంట పాటు గ్యాస్ లీక్ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్యాస్ లీకేజీతో ప్రజలు శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వీరపల్లి, లక్ష్మీపురం, ఎల్కలపల్లి, పెంచికల్‌పేట ప్రాంతాల్లో లీకేజీ మరింత ఎక్కువగా ఉండగా, తిలక్‌నగర్, విఠల్ నగర్, అడ్డగుంటపల్లి, ఇందిరానగర్, గౌతమి నగర్, గోదావరి ఖని, కల్యాణ్‌నగర్ తదితర ప్రాంతాలకు గ్యాస్ వ్యాపించింది. దీంతో ఏం జరుగుతోందో అర్థం కాక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తికి ప్రిల్లింగ్ యూనిట్, ప్రిల్లింగ్ టవర్ కీలకంగా వ్యవహరిస్తాయి. ఇక్కడ లిక్విడ్ అమ్మోనియాను శీతలీకరించి ఘనరూపంలో యూరియాగా మార్చుతారు. గతంలోనూ ఈ యూనిట్ నుంచి అమ్మోనియా లీకైంది. తాజా లీకేజీ కూడా ఇక్కడి నుంచే జరిగి ఉంటుందన్న అనుమానం వ్యక్తమవుతోంది. మరోవైపు, ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న ప్రమాదకరమైన రసాయనాలను శుద్ధి చేయకుండా బయటకు విడుదల చేస్తుండడంతో సంజయ్‌నగర్ ఆక్సిడైజేషన్ పాండ్‌లోని చేపలు మృత్యువాత పడుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు

## ఏపీ, తెలంగాణ అంబులెన్స్‌లకు రిలయన్స్ ఉచిత ఇంధనం

హైదరాబాద్ , మే 18: కరోనా మహమ్మారితో పోరాడుతున్న తెలుగు రాష్ట్రాలకు తన వంతు సాయం అందించేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కొవిడ్ సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్న అత్యవసర వాహనాలు అంబులెన్స్‌లకు రియలన్స్ పెట్రోలు బంకుల ద్వారా ఉచిత ఇంధనాన్ని అందించనున్నట్టు తెలిపింది. కొవిడ్ కార్యకలాపాల్లో ఉన్నట్టు సంబంధిత అధికారులు జారీ చేసిన లేఖ ఉన్న వాహనాలకు రోజుకు గరిష్ఠంగా 50 లీటర్ల ఇంధనాన్ని ఉచితంగా అందించనున్నట్టు పేర్కొంది. జూన్ 30 వరకు ఇది అందుబాటులో ఉంటుందని వివరించింది. అలాగే, ఇప్పటికే ఉభయ రాష్ట్రాలకు చెరో 80 టన్నుల లిక్విడ్ ఆక్సిజన్‌ను అందించినట్టు రిలయన్స్ వివరించింది.

# మొదటి దశలోనే జాగ్రత్త వహించి ప్రాణాలు దక్కించుకోండి

**-కోవిడ్ లక్షణాలుంటే తక్షణమే టెస్టులు చేయించుకోండి**
**-క్వారంటాయిన్ పూర్తికాకముందే బయటకు వచ్చి కోవిడ్ వ్యాప్తి చేసి ఇతరులకు హనీ చేయకండి**
**-కోవిడ్ హెల్ప్ లైన్ లో ఎదురైన అనుభవాలు చెప్పిన గులాం అహ్మద్ హుస్సేన్**



రాజన్న సిరిసిల్ల మే, 18(నేటినిజం ప్రతినిధి): కోవిడ్ లక్షణాలు కనిపించిన తక్షణమే జాగ్రత్త వహించి వెంటనే టెస్టు చేయించుకొని, డాక్టర్ ను సంప్రదించి చికిత్స తీసుకుంటే తమను తాము రక్షించుకుని ప్రాణాలతో బయట పడ్డ వాళ్ళము అవుతామని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. ఎంఐఎం పార్టీ పక్షాన కోవిడ్ హెల్ప్ లైన్ సేవలను అందిస్తున్న ఆయనకు ఎదురైన అనుభవాలను వీడియో ద్వారా సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో జ్వరం, జలుబు, తీవ్రమైన తలనొప్పి, ఒళ్లునొప్పులు, దగ్గు, నాలుకపై పొక్కులు వస్తున్న వారు అవి కోవిడ్ లక్షణాలు అని తెలియక కొందరు, తెలిసి అజాగ్రత్త వహించి, ఇవన్నీ మాములేనని 5 లేదా 6 రోజులు ఎవరికి చెప్పకుండా ఉంటూ ప్రాణాల మీదికి తెచ్చుకొని, భయంతో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. కోవిడ్ తో లక్షణాలు కనిపించిన వెంటనే ఒకటి రెండు రోజుల్లో చికిత్స తీసుకుని, మందులు, పౌష్టికాహారం తీసుకుంటే ఆక్సిజన్, వెంటిలేటర్ పెట్టె పరిస్థితి రాదన్నారు. తద్వారాకోవిడ్ నుండి ప్రాణాలురక్షించుకోగలమన్నారు. ఇక హోం క్వారంటయిన్ పూర్తికాకముందే వ్యాధి నయమైందని కోవిడ్ రోగులు విచ్చలవిడిగా బయట తిరుగుతుండటంతో కరోనా వ్యాప్తి ఎక్కువ అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

హోం క్వారంటయిన్ పూర్తి కాకముందు బయటకు రావొద్దని కోరారు. కోవిడ్ నుండి కోలుకున్న వారు ప్లాస్మా దానం చేయాలని పిలుపునిచ్చారు. ఇతరుల ప్రాణదానానికి చేయుతనివ్వాలన్నారు. మాస్కులు తప్పనిసరి ధరించాలని కోరారు. ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు కోవిడ్ హెల్ప్ లైన్ 24/7 ద్వారా అనుక్షణం పగలు రాత్రి తేడా లేకుండా కోవిడ్ బాధితులకు అండగా వెంటిలేటర్, ఆక్సిజన్ సిలిండర్ల సమకూర్చడం, ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కువ శాతం చేర్పిస్తూ, ప్రయివేటు ఆసుపత్రుల్లో సైతం సేవలు చేస్తూ, ఎంఐఎం నేతలతో పాటు సామాజిక కార్యకర్తలను కలుపుకుని ముందుకు సాగుతున్నామన్నారు. ఇటీవలే నాగపూర్ కు చెందిన మహిళకు పాజిటివ్ వచ్చి ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. హైదరాబాద్ ఎంఐఎం కార్యాలయం దారుస్సలాం నుండి ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ ఇఫ్ఫాయింది ద్వారా ఫోన్ సమాచారం అందిన వెంటనే ఇస్లామిక్ సంప్రదాయం ప్రకారం బైపాస్ ఖబ్రస్థాన్ వద్ద ఉన్న టీమ్ సభ్యుల సహకారంతో మహిళకు అంత్యక్రియలు నిర్వహించారు. ప్రాణాలు పణంగా పెట్టి ఆపత్కాలంలో రాత్రి, పగలు తేడా లేకుండా సేవే పరమావధిగా, అంత్యక్రియలు నిర్వహిస్తున్న టీమ్ సభ్యులను ప్రభుత్వ పరంగా సన్మానించాలన్నారు. వీరి సేవలను ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్ వినోద్ కుమార్, జిల్లా మంత్రి గంగుల, మేయర్సునీల్ రావు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. రమజాన్ తో పాటు లాక్ డౌన్ ఆపత్కాలంలో అమోఘమైన సేవలు అందించిన మున్సిపల్, పోలీసు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది చేస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు.

# సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు లబ్ధి

జగిత్యాల, మే 18: సీఎంఆర్ఎఫ్ ఎందరికో బాసటగా నిలుస్తున్నదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 41మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.12లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో సీఎం సహాయనిధి ద్వారా ఇంత మంది లబ్ధిపొందిన దాఖలాలు లేవని, తెలంగాణ ప్రభుత్వం సీఎం సహాయనిధిపై ప్రత్యేక చొరవ చూపుతూ నిరుపేదలకు అండగా నిలిచిందన్నారు. సంక్షోభ సమయంలోనూ పథకాలు ఆపకుండా సీఎం కేసీఆర్ అండగా ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్, టీఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు దావ సురేశ్, రైతుబంధు అర్బన్ మండల కన్వీనర్ జుంబర్తి శంకర్, పీఏసీఎస్ చైర్మన్ సందీప్ రావు, సర్పంచులు గంగారాం, నారాయణ గౌడ్, ప్రభాకర్, బోనగిరి నారాయణ, మహేశ్వర రావు, ఎంపీటీసీ మహేశ్, ఉప సర్పంచ్ బొడ్డు బుచ్చన్న, ఏఎంసీ డైరెక్టర్ రవి, నాయకులు కట్ల రాజేందర్, అంజన్న, రవి, రాజు గౌడ్, కుడుకల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

# ‘ప్రైవేట్’ ఆసుపత్రులకు మంత్రి వార్నింగ్

**-ప్రైవేట్ ఆస్పత్రుల యాజమానుల సమావేశంలో మంత్రి పువ్వాడ**



ఖమ్మం, మే 18: వైద్యం కోసం వచ్చినవారిని పీల్చిపిప్పి చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాల తీరుపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కన్నెర్ర చేశారు. కొవిడ్ పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల తీరు మారకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రెమ్‌డెసివర్ ఇంజెక్షన్లను బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో సౌకర్యాలు, ఫీజులు ఉండాలని ఆయన ఆదేశించారు.

కొవిడ్ నియంత్రణతో పేరుతో ప్రైవేట్ ఆస్పత్రులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించబోమని, అవసరమైతే అటువంటి ఆస్పత్రులను సీజ్ చేసేందుకైనా వెనుకాడబోమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఖమ్మంలోని జడ్పీ సమావేశ మందిరంలో ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యం కోసం వచ్చే కొవిడ్ బాధితులను ఆర్థికంగా పీల్చి పిప్పి చేయాలని చూస్తే ఊరుకోబోమని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సౌకర్యాలు, ఫీజులు ఉండాలని ఆదేశించారు. రూం రెంటుపై వస్తున్న ఆరోపణలు, సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన ఆస్పత్రికి బిల్లు అంశాలపై నగరంలోని సురక్ష ఆస్పత్రి యాజమాన్యాన్ని మంత్రి ప్రశ్నించారు. ఇది తమ పేరుతో ఎవరో రాసిన బిల్లు అని ఆస్పత్రి ప్రతినిధి సమాధానమిచ్చారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించారు. మొత్తం వ్యవహారంపై పూర్తి విచారణ చేయాలని అక్కడే ఉన్న సీపీని ఆదేశించారు. రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్లు అందజేస్తున్నప్పటికీ కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ కన్ను గప్పి నేరుగా కంపెనీల నుంచి ఇంజక్షన్లు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్నప్పుడు మళ్లీ ఈ తరహా ప్రయత్నాలు చేయడం వల్ల అనేక ఆరోపణలు, అపవాదులు వస్తున్నాయని అన్నారు. ఆక్సీజన్, రెమ్‌డెసివిర్ ఇంజక్షన్లకు సంబంధించి అన్ని ప్రైవేట్ ఆస్పతుల్లో ఇక రోజువారీ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు.

ఆస్పత్రుల్లో కొవిడ్ నిబంధనల అమలు తీరును పరిశీలించాల్సిందిగా నలుగురు అధికారులతో వేసిన కమిటీ ఎన్ని ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసిందని కమిటీ సభ్యుడైన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రామానుజాన్ని మంత్రి ప్రశ్నించారు. ఇప్పటి వరకు చేయలేదని ఆయన చెప్పడంతో తక్షణమే ఆకస్మిక తనిఖీలు చేయాలని డీఎంహెచ్‌ఓ మాలతిని మంత్రి ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో కొవిడ్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఆక్సిజన్ కొరత కూడా లేదన్నారు. రోజుకు 1500 చొప్పున వారానికి 10 వేల రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్లు ఖమ్మం జిల్లాకు రానున్నాయన్నారు. ఈ మేరకు హెటిరో డ్రగ్స్ అధినేత బండి పార్థసారథిరెడ్డితో తాను చర్చించానని చెప్పారు. ఆస్పత్రుల యాజమానులు, వైద్యులు మానవత దృక్పథంతో కొవిడ్ బాధితులకు వైద్యం చేయాలని సూచించారు. వారి ప్రాణాలతో వ్యాపారం చేయడం సరికాదన్నారు. రెమ్‌డెసివిర్ ఘటనలు పునరావృతం అయితే ఆస్పత్రులను పర్మినెంట్‌గా సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఖమ్మం కలెక్టర్ కర్ణన్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటి సర్వే విస్తృతంగా కొనసాగుతుందన్నారు. సీపీ విష్ణు ఎస్ వారియర్, కేఎంసీ కమిషనర్ అనురాగ్ జయంతి, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



రాజన్న సిరిసిల్ల మే, 18(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణానికి చెందిన యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేములవాడ లోని యాచకులకు, నిరాశ్రయులకు దాదాపు 200 మందికి మజ్జిగ పాకెట్స్ పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కానిస్టేబుల్ గౌడిశెల రాజశేఖర్ మాట్లాడుతూ లాక్ డౌన్ కారణం గా పేదలకు తమ వంతుగా సహాయం చేయాలనే ఉద్దేశ్యం తో అన్నదానం, సరుకుల పంపిణీ చేస్తునట్టు తెలిపారు. గత సంవత్సరం లాక్ డౌన్ లో యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్విరామంగా 50 రోజులు అన్నదానం చేసినట్టు తెలిపారు.

లాక్ డౌన్ కారణం గా ఆహారానికి ఇబ్బంది పడేవారికి ప్రతీ ఒక్కరు తమకు తోచిన సహాయం అందించాలని కోరారు. ఎవరైనా సహాయం చేయాలి అనుకుంటే యువ ఫౌండేషన్ ని సంప్రదించండి అని, ఫౌండేషన్ కి సహకరిస్తున్న ప్రతీ ఒక్క దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గడప కిషోర్ రావు యువ ఫౌండేషన్ సభ్యులు విశాల్ కుమార్, మహేష్, సాయి,పర్శరాము, రామ్ పాల్గొన్నారు.

# అనుమతుల్లేకుంటే రానివ్వద్దు ..

హైదరాబాద్ , మే 18: కరోనా వ్యాప్తి నియంత్రణ కు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, ఇతర రాష్ట్రా ల నుంచి అనుమతి లేకుండా వచ్చే ప్రజలను రానివ్వద్దని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సూచిం చారు. సోమవారం మండలంలోని జంగాం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా చెక్‌పోస్ట్‌ను ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వం లాక్‌డౌన్ అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రతి ఒక్కరూ లాక్‌డౌన్ నిబంధనలు పాటించేలా చూడాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ఇంతియాజ్‌లాలను పరామర్శించారు. ఇటీవల ఇంతియాజ్‌లాల తండ్రి మృతి చెందాడు. మంత్రి ఇంతియాజ్‌లా లను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మంత్రి వెంట జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబుతాలిబ్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చిర్లె లక్ష్మణ్, మెస్రం అంబాజీ, సర్పంచ్ కుంరం శ్యాంరావ్ తదితరులున్నారు.

# 86 రైల్వే ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు

హైదరాబాద్ , మే 18: కోవిడ్-19 కట్టడి నివారణకు జరుగుతున్న ప్రయత్నాలలో భారత రైల్వేలు పూర్తి స్థాయిలో వివిధ మార్గాల్లో తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తున్నాయి. అవసరమైన ప్రాంతాలకు అత్యంత వేగంగా ఆక్సిజన్ తరలిస్తున్న రైల్వేలు మరోవైపు ప్రయాణీకులు సరకులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ఇదేసమయంలో తన సిబ్బందికి అవసరమైన వైద్య సౌకర్యాలను అందించే అంశంపై రైల్వేశాఖ దృష్టి సారించింది.

తన ఉద్యోగుల కోసం రైల్వేశాఖ దేశం వివిధ ప్రాంతాల్లో 86 ఆసుపత్రులను నిర్వహిస్తోంది. వీటిలో మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొని రావడానికి రైల్వే శాఖ బృహత్తర ప్రణాళికను రూపొందించి అమలు చేస్తోంది. దీనిలో భాగంగా అన్ని ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంటులు ఏర్పాటుకానున్నాయి. ఇప్పటికీ నాలుగు ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయి. 52 ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు అయ్యాయి. మిగిలిన 30 ప్లాంట్ల ఏర్పాటు అంశం వివిధ దశల్లో వుంది. కోవిడ్ ఆసుపత్రులుగా సేవలు అందిస్తున్న అన్ని రైల్వే ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులోకి రానున్నాయి.

ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి రెండు కోట్ల రూపాయల వరకు నిధులను విడుదల చేసే అధికారాన్ని జనరల్ మేనేజర్లకు రైల్వేలు కల్పించాయి. రైల్వే బోర్డు దీనికి సంబంధించి 2021 మే నాల్గవ తేదీన 2020 / ఈ (చీ) ఎఎ / ఖచి / 3 / పీటీ ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది.

వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొనే వచ్చే అంశంపై కూడా రైల్వేశాఖ దృష్టి సారించింది. కోవిడ్ చికిత్స అందించడానికి పడకల సంఖ్యను 2539 నుంచి 6972కి పెంచారు. ఇదేవిధంగా కోవిడ్ ఆస్పత్రుల్లో ఐసీయూ పడకల సంఖ్యను 273 నుంచి 573కి పెంచడం జరిగింది.

వెంటిలేటర్ల సంఖ్యని 62 నుంచి 296కి పెంచిన అధికారులు బిపాప్ యంత్రాలు, ఆక్సిజన్ సాంద్రతలు, ఆక్సిజన్ సిలిండర్లు వంటిముఖ్యమైన వైద్య పరికరాలు మరింతగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. కోవిడ్ బారిన పడిన రైల్వే ఉద్యోగులు అవసరమైతే వైద్యుల సిఫార్సు మేరకు ఎంపానెల్డ్ ఆసుపత్రులలో చేరడానికి అనుమతి ఇస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రైల్వే ఆసుపత్రుల్లో ఏర్పాటవుతున్న సౌకర్యాలు అత్యవసర చికిత్సను అందించడానికి ఉపయోగపడతాయి.

## కరోనాను ఆరోగ్య శ్రీ లో చేర్చాలి.... వినియోగదారుల మండలి అధ్యక్షులు పాష సయ్యద్.



రాజన్న సిరిసిల్ల మే, 18(నేటినిజం ప్రతినిధి): కరోనా చికిత్సను ఆరోగ్య శ్రీ లో చేర్చాలని వినియోగదారుల మండలి అధ్యక్షులు పాష సయ్యద్ రాష్ట్ర మంత్రి కే టి ఆర్ ను మంగళ వరం అస్క్ టీవిటర్ వేదిక ద్వారా అభ్యర్తించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ కరోనాను ఆరోగ్య శ్రీ లో చేరుస్తామన్న కే సి ఆర్ హామీ 8 నెలలు గడిచిన అమలు కావట్లేదని గుర్తు చేశారు. కరోనా సెకండ్ వేవ్ తో జనాలు పిట్టల్లా రాలుతున్నారని కరోనా చికిత్సను వెంటనే ఆరోగ్య శ్రీ లో చేర్చి చికిత్స పరిమితి ని 5 లక్షలకు పెంచాలి ఈ సందర్బంగా డిమాండ్ చేసారు. రాష్ట్రం లోని ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు పెంచి, వైద్యులు, సిబ్బంది, మందుల కొరతను తీర్చాలన్నారు. ప్రవైట్ లో కరోనా ట్రీట్ మెంట్ కు ఇష్టమొచ్చినటు గా దండుకొంటున్నారని పేద మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతున్న ప్రవైట్ హాస్పిటల్లపై నియంత్రణ చేయటం లేదన్నారు. వ్యాక్సిన్ కొరతను నివారించి రాష్ట్రం లోని ప్రతి ఒక్కరికి కోవిడ్ వ్యాక్సిన్ ఇవ్వాలని ఈ సందర్బంగా డిమాండ్ చేసారు.

## ఆంఫోటెరిసిన్-బి డిమాండ్, సరఫరాను సమీక్షించి, లభ్యతను నిర్ధరించిన శ్రీ మన్‌సుఖ్ మాండవీయ

హైదరాబాద్ , మే 18: మ్యుకోర్‌మైకోసిస్ చికిత్సలో ఉపయోగించే ఆంఫోటెరిసిన్-బి కోసం దేశవ్యాప్తంగా నెలకొన్న డిమాండ్, సరఫరాపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయ సమీక్ష నిర్వహించారు. దేశీయ ఉత్పత్తిని పెంచడంతోపాటు, ప్రపంచ దేశాల నుంచి ఈ ఔషధాన్ని దిగుమతి చేసుకునేలా తయారీదారులతో కలిసి కేంద్ర ప్రభుత్వం ఒక వ్యూహాన్ని రూపొందించింది.

దేశవ్యాప్తంగా ఆంఫోటెరిసిన్-బి సరఫరా అనేక రెట్లు పెరిగినట్లు మంత్రి గుర్తించారు. కానీ, ఈ ఔషధానికి ఆకస్మిక డిమాండ్ ఏర్పడింది. అవసరమైన రోగులకు ఈ మందును అందించేందుకు సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

ఆంఫోటెరిసిన్-బి సరఫరా, పంపిణీ గొలుసును సమర్థవంతంగా నిర్వహించేందుకు ఒక విధానాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం సూచించింది. సాధ్యమైనంత త్వరగా ఔషధం లోటు భర్తీ అవుతుందని భావిస్తున్నారు. కేంద్రం సూచించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఔషధాన్ని సక్రమంగా వినియోగించాలని శ్రీ మాండవీయ అన్ని రాష్ట్రాలను కోరారు.

## సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి.. !



సంగారెడ్డి మే18 (నేటినిజం ప్రతినిధి) సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోని కరోన వార్డును మెదక్ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్బంగా డ్యూటీలో ఉన్న డాక్టర్స్ మరియు బాధితుల తో మాట్లాడుతూ బాధితులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకల సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు కరోన బాధితులను పరామర్శించి వారితో మాట్లాడుతూ కరోన రావడం సహజమని కరోన వచ్చినంత మాత్రాన భయపడాల్సిన అవసరం లేదన,వైద్యులు అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చి చికిత్స అందిస్తారని, మన ధైర్యమే మనకు బలమని ఎక్కడ ధైర్యాన్ని కోల్పోకూడదు. కరోన బాధితులలో మనో ధైర్యాన్ని నింపారు. ఎంపీ వెంట స్థానిక మాజీ శాసనసభ్యులు చింతా ప్రభాకర్ , మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా కోవిడ్-19 లానెక్సెస్ ఇండియా సహాయం

హైదరాబాద్ , మే 18: కరోనా వైరస్ మహమ్మారిపై పోరాటంలో తన వంతుగా తన సీఎస్ఆర్ కార్యకలాపాల్లో భాగంగా లానెక్సెస్ ఇండియా వైద్యపరమైన మౌలిక వసతులకు గాను రూ.2.1 కోట్ల మేరకు సాయం చేసింది. సెకండ్ వేవ్ లో కోవిడ్ -19 కేసులు బాగా పెరిగిపోయాయి. దీంతో రోగులకు చికిత్స చేసేందుకు ఉపయోగించే ముఖ్యమైన వైద్య ఉపకరణాలకు డిమాండ్ బాగా పెరిగిపోయింది. ఆసుపత్రులు ఈ సమయంలో మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు వీలుగా లానెక్సెస్ ఇండియా రూ. 1.9 కోట్ల విలువైన అధునాతన జర్మన్ వెంటిలేటర్లు 20 యూనిట్లను థానె, ముంబై (మహారాష్ట్ర), ఉజ్జయిని (మధ్యప్రదేశ్), అంక్లేశ్వర్, బారుచ్ (గుజరాత్)లలోని ఆసుపత్రులకు విరాళంగా అందించింది. తన సైట్లు, కార్యాలయాలు గల మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లోని తొమ్మిది ఆసుపత్రులకు ఈ వెంటిలేటర్లను కంపెనీ విరాళంగా అందించింది. థానేలోని కౌశల్య మెడికల్ ఫౌండేషన్ ట్రస్ట్ హాస్పిటల్ మరియు బెథానీ హాస్పిటల్, ముంబైలోని శుశ్రుషా హాస్పిటల్, అంక్లేశ్వర్ లోని జయబెన్ మోడీ హాస్పిటల్, సేవాశ్రమ్ హాస్పిటల్ మరియు భరూచ్ లోని సివిల్ హాస్పిటల్, పాటి దార్ హాస్పిటల్, జె కె హాస్పిటల్ మరియు ఉజ్జయినిలోని ఎస్ఎస్ హాస్పిటల్ ఠ రీసెర్చ్ సెంటర్ ఉన్నాయి. కోవిడ్- 19 రోగుల చికిత్స కోసం ఆసుపత్రులు ఈ వెంటిలేటర్లను ఉపయోగిస్తాయి. అదనంగా, దేశంలో పెరుగుతున్న వైద్య ఆక్సిజన్ అవసరాన్ని ఎదుర్కోవటానికి, లానెక్సెస్ ఇండియా పది యూనిట్ల ఆక్సిజన్ కాన్సంట్రేటర్లతో ఉజ్జయిని జిల్లా ఆసుపత్రికి మద్దతు ఇచ్చింది. నాగ్దాలోని ఎంప్లాయీ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ హాస్పిటల్ (ఇఎస్ఐసి) కు రూ.10 లక్షలతో కంపెనీ ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను మెరుగు పరచడంలో, రోగులకు మెరుగైన వైద్య సహాయం అందించడంలో సహాయ పడింది. లానెక్సెస్ ఇండియా వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నీలాంజన్ బెనర్జీ ఈ సందర్భం గా మాట్లాడుతూ, “భారతదేశంలో ప్రస్తుత కరోనావైరస్ మహమ్మారి రెండవ తరంగం మన దేశ వైద్య మౌలిక సదుపాయాలను భారంతో ముంచెత్తింది, క్లిష్టమైన వైద్య పరికరాల కొరతకు దారితీసింది. మా కార్పొరేట్ సామాజిక బాధ్యత ప్రయత్నాల్లో భాగంగా, థానేలోని మా ప్రధాన కార్యాలయం మరియు నాగ్దా, జగాడియా లలోని మా కర్మాగారాల చుట్టూ ఉన్న కొన్ని ఆసుపత్రుల మౌలిక సదుపాయాల అభి వృద్ధికి మద్దతు ఇవ్వడానికి మేం మరోసారి ప్రయత్నించాం. కోవిడ్ -19 వినాశకర మైన సెకండ్ వేవ్ తో పోరాడటానికి మేం సమాజానికి సహాయం చేస్తూనే ఉంటాం” అని అన్నారు.

# సర్కారు దవాఖానలోనే అన్ని పరీక్షలు

మహబూబాబాద్,మే 18: ఇక నుంచి జిల్లా కేం ద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయనున్నట్లు గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం ఆమె జడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు, కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌తో కలిసి జిల్లా ఆస్పత్రిలో ఆధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌ను ప్రారంభించారు.

అనంతరం మంత్రి గార్ల మండలంలో నూతనంగా నిర్మించిన 30 పడకల దవాఖానలోని పై అంతస్తులో కొవిడ్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన 20 ఆక్సిజన్ బెడ్లను ప్రారంభించారు.

ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ దవాఖానలకు అత్యాధునిక టెక్నాలజీతో కూడిన రక్త, మూత్ర పరీక్ష యంత్రాలను ఏర్పాటు చేస్తున్నదన్నారు. మహబూబాబాద్ ఆస్పత్రిలో రూ.2.7కోట్లతో 57 రకాల వైద్యపరీక్షలు నిర్వహించేందుకు టీ డయాగ్నొస్టిక్ హబ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో లేనన్ని సౌకర్యాలు ప్రభుత్వ ఆస్పత్రు ల్లో ఉన్నాయన్నారు.

మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ కొవిడ్ రోగులకు అత్యవసర మందులు, ఆక్సిజన్ సక్రమంగా అందేలా నిత్యం పర్యవేక్షిస్తున్నదన్నారు.

కరోనా మహమ్మారిపై ప్రజలు నిర్లక్ష్యంగా ఉండొద్దని కోరారు. లాక్‌డౌన్‌తో ప్రజలు కొంతఇబ్బంది పడ్డప్పటికీ కరోనా వైరస్ తగ్గుముఖం పడుతున్నదన్నారు. రాష్ట్రంలో నూతన దవాఖానల నిర్మాణం వేగంగా పూర్తవుతున్నదని, ఇప్పటికే కొన్ని దవాఖానల్లో కొవిడ్ బాధితుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. గార్లలో ఎమ్మెల్యే హరిప్రియానాయక్ మాట్లాడుతూ.. ప్రజలు మాస్కులు ధరించడంతోపాటు భౌతికదూరం పాటించాలని కోరారు.

ఆయా కార్యక్రమాల్లో జడ్పీచైర్‌పర్సన్ బిందు, కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, మహబూబాబాద్ మునిసిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, గార్ల సర్పంచ్ బన్సీలాల్ నాయక్, జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు వెంకట్రాములు, కౌన్సిలర్ గంగాధర్, వడ్డేబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# లాక్ డౌన్ ఉల్లంఘించిన వారిపై మరింత కఠిన చర్యలు

**-జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే**

**కొవిడ్ -19, లాక్ డౌన్ నిబంధనలు ఉల్లంఘించిన 1555 మందిపై కేసులు నమోదు,**

**పట్టణంలో లాక్ డౌన్ సందర్భంగా స్పెషల్ డ్రైవ్**



రాజన్న సిరిసిల్ల మే, 18(నేటినిజం ప్రతినిధి): లాక్ డౌన్ ఉల్లంఘించిన వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు .

జిల్లా వ్యాప్తంగా ఏడవరోజు పటిష్టమైన బందోబస్తు మధ్య లాక్ డౌన్ ప్రశాంతంగా కొనసాగుతున్నది అని ఈ సందర్భంగా జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే పట్టణంలో స్పెషల్ డ్రైవ్ చేసి పర్యవేక్షించారు, ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో 11ప్రాంతాలను ప్రత్యేక హాట్ స్పాట్స్ గా గుర్తించి ఒక ఎస్.ఐ ముగ్గురు కానిస్టేబుల్స్ తో ప్రత్యేక పికెట్స్ శాంతినగర్ ,పోస్ట్ ఆఫీస్,వెంకంపేట్, సుభాష్ నగర్, వాని హస్పటిల్,జె.పి నగర్,అంబేద్కర్ నగర్, బి.వై నగర్,సాయిబాబా టెంపుల్,విద్యానగర్,కోర్ట్ చౌరస్తా రోడ్ లో ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం లో 7వ రోజు లాక్ డౌన్ నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పలు వీధులు బైక్ పై తిరుగుతూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పికెట్స్ ను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా బయటకి వచ్చిన 71 వాహనాల పై కేసులు నమోదు చేయడం జరిగింది అని అన్నారు అదేవిధంగా లాక్ డౌన్ సమయంలో ఎలాంటి కారణం లేకుండా నిర్లక్ష్యంగాబయట తిరుగుతున్న వాహనదారులపై ( ఈతితీ’బ-15, 51బి డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్ట్ కింద ఈ పెట్టి కేసులు-198, 51బి డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్ట్ కింద ఈ చాలాన్ కేసులు-1342) 1555 కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రణాళిక ప్రకారం పట్టణంలో అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి నిర్లక్ష్యంగా తిరుగుతున్న వారిపైచర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్య శ్రేయస్సుకై తమ ప్రాణాలను ఫణంగా పెట్టి బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు, కరోనా వైరస్ మహమ్మారిని కట్టడి చేయడానికి కలిసికట్టుగా చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు, ప్రస్తుత విపత్కర పరిస్థితులను ప్రజలంతా తమకు తాము రక్షించుకుంటూ సమాజాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు.ఎస్పీ వెంట డిఎస్పీ చంద్రశేఖర్ , సిరిసిల్ల టౌన్ రురల్ సి.ఐ లు అనిల్ కుమార్,ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ అని పేద ప్రజల మన్ననలు పొందుతున్న తోట రామ్ కుమార్

**నిరుపేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ**



రాజన్న సిరిసిల్ల మే, 18(నేటినిజం ప్రతినిధి): కరోనా మహమ్మారిరెండోసారి విజృంభించడంతో రాష్ట్ర ప్రభుత్వం లాక్ డౌన్ విధించింది దీనితో కొంత మందికి ఉపాధి లేక తినడానికి తిండి లేక అల్లాడుతున్న సమయంలో టిఆర్ కే ట్రస్ట్ నిరు పేద ప్రజల కడుపు నింపుతూ. అన్నదాత సుఖీభవ.అని ప్రజల నుండి దీవెనలు పొందుతూ మంగళవారం నాలుగవ రోజు కూడా వేములవాడ పట్టణ పరిసర ప్రాంతాల్లోని వలస జీవులకు, కూలీలకు, ఆలయ పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసేవారికి, అలాగే కొనాయపల్లి శివారు ప్రాంతంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న కూలీలకు టి ఆర్ కె ట్రస్ట్ సభ్యులు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టి.ఆర్.కె ట్రస్ట్ డైరెక్టర్ ×మొట్టల మహేష్ కుమారమాట్లాడుతూ నిరుపేదల ఆకలి తీర్చేందుకు టి ఆర్ కె ట్రస్ట్ సేవలు ఎల్లప్పుడూ ఉంటాయని, ఇలాంటి కష్ట కాలంలో పేదలకు తమ వంతు సహాయం చేస్తామని లాక్ డౌన్ ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులు వారికి ట్రస్టు తరఫున ఆహార ప్యాకెట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. టి ఆర్ కే ట్రస్టు తరఫున సహాయం అందుకున్న ప్రజలు మాట్లాడుతూ గతంలో లాక్డౌన్ ఉన్నప్పుడు టి ఆర్ కె ట్రస్ట్ సభ్యులు ఇంటింటికి తిరుగుతూ నిత్యవసర సరుకులను పంపిణీ చేయడమే కాకుండా నిరుపేదల ఆకలి తీర్చే ఆపద సమయంలో అండగా ఉన్నారన్నారు. అదే విధంగా మరోసారి పేద ప్రజల ఆకలి తీర్చేందుకు కరోనా కష్టకాలంలో ఎంతో సహాయం చేస్తున్నారని తెలిపారు. గతంలో ప్రమాదవశాత్తు ఆసుపత్రిలో ఉన్నవారికి నగదు సహాయం అందజేసి ప్రాణదాతలుగా నిలిచారని అన్నారు. లాక్ డౌన్ సమయంలో ఎందరో నిరుపేదలు తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకొని టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు ×తోట రామ్ కుమార్ గారు× ముందుకు వచ్చి నిరుపేదల ఆకలిని తీర్చడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ కె వర్కింగ్ టీం, ఎంక్వయిరీ టీం సభ్యులు పాల్గొన్నారు.

# మూడేళ్ళ పోరాటానికి ఫలితం ... మెడికల్ కాలేజ్ మంజూరు..!

**- సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి.**



సంగారెడ్డి మె 18 (నేటినిజం ప్రతినిధి) సంగారెడ్డికి మెడికల్ కాలేజ్ ప్రకటించినందుకు చాలా సంతోషంగా ఉందని.. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలని కాంగ్రెస్ సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మెడికల్ కాలేజ్ కోసం మూడేళ్లు పోరాటం చేశా.. నా కూతురుతో కలిసి అసెంబ్లీకి పాదయాత్ర చేసిన వెంటనే మెడికల్ కాలేజ్‌కు వెయ్యి కోట్లు కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను జగ్గారెడ్డి కోరారు. కొబ్బరికాయ కొట్టి సీఎం శంకుస్థాపన చేయాలని.. ఎమ్మెల్యేగా తనకు సీఎంగా కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్నారు. శంకుస్థాపనకు వచ్చిన రోజు కేసీఆర్ అనుమతితో భారీ సన్మానం చేస్తానని తెలిపారు. ఈ విషయం పార్టీకి సంబంధం లేదు.. నా వ్యక్తిగతమని జగ్గారెడ్డి చెప్పారు. అపాయింట్ మెంట్ ఇస్తే వెళ్లి కేసీఆర్‌ను కలుస్తా.. కృతజ్ఞతలు చెబుతానని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com